www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం 16-08-2024

సంపుటి : 01 | సంచిక : 104 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



V3 NEWS



డా॥ కాచం సత్యనారాయణ CMD




ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి

# భారత్ ఎదగాలి

**2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యం**

దేశాన్ని ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలి..

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..

అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలి

ఎర్రకోటపై దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని మోదీ

**దిల్లీ:** దేశవ్యాప్తంగా 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. వరుసగా 11వసారి ఆయన ప్రధానిగా జెండా ఎగురవేశారు. వేడుకలకు సుమారు మిగతా2లో...

## మోదీ అరుదైన రికార్డు

స్వాతంత్ర్య ప్రసంగాల చరిత్రలో అత్యధిక సమయం మాట్లాడిన ప్రధానిగా ఘనత 2

ప్రపంచానికి ముఖద్వారంగా

# తెలంగాణ

విశ్వవేదికపై సగర్వంగా రాష్ట్రబ్రాండ్‌ను చాటుతాం

గత ప్రభుత్వంలా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి భారం వేయం

త్వరలో రైతు భరోసా ప్రారంభిస్తాం

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణను ప్రపంచానికి ముఖద్వారంగా మార్చాలని రాష్ట్ర బ్రాండ్‌ను విశ్వవేదికపై సగర్వంగా చాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడుల సాధన కోసం అమెరికాలో పర్యటించి, దిగ్గజ సంస్థల అధినేతలు, ప్రతినిధులతో భేటీ అయి ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను వారికి పరిచయం చేశామని తెలిపారు. . మరోవైపు హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి హైడ్రా ఏర్పాటు చేసుకున్నామన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన గోల్కొండ కోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించిన అనంతరం మట్లాడారు. గత ప్రభుత్వం లాగా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రజల నెత్తిన భారం వేయబోమని స్పష్టంచేశారు. అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశం అయ్యామని, మిగతా2లో...




223 కొత్త పంచాయతీలకు

## గెజిట్ విడుదల

**12,991కు చేరిన పంచాయతీలు**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో కొత్తగా 223 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత బీఆరెస్ ప్రభుత్వ హయంలో కొత్తగా 223గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ అసెంబ్లీ, మండలిలు బిల్లును ఆమోదించాయి. ఆ బిల్లును అప్పటి గవర్నర్ తమిళిసై పెండింగ్‌లో ఉంచారు . గత గవర్నర్ రాధాకిషన్ ఆమోదం తెలపడంతో కొత్త పంచాయతీలపై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త పంచాయతీల సమాచారాన్ని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు మిగతా2లో...

# రుణమాఫీ మాట నిలబెట్టుకున్నా

**హరీశ్‌రావు రాజీనామా చేయాలి**

లేదంటే ఆయన ముక్కు నేలకు రాయాలి

వైరా సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, వైరా:**

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని ఖమ్మం గడ్డ నుంచి మాటిచ్చానని, ఎంత మంది అడ్డుపడినా రైతు రుణమాఫీ చేసి చూపించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నరు. రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా మిగతా2లో...



## సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్‌ను ప్రారంభించిన సీఎం 2

మీ రుణమాఫీ పచ్చి అబద్ధం అని

## తేలిపోయింది

**సోనియా మీద ఒట్టు పెట్టినా..**

దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్ధమే అతని లక్షణం

రేవంత్ రెడ్డి విమర్శలపై హరీశ్‌రావు కౌంటర్



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు ప్రవర్తించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి తనపై చేసిన విమర్శలను హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తిప్పికొట్టారు. "దేవుళ్లపై ఒట్టు పెట్టుకొని మాట మీద నిలబడక పోగా.. నిస్సిగ్గుగా బీఆర్ఎస్పై, నాపై విమర్శలు చేస్తున్నారు. సోనియాగాంధీ పుట్టిన మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 80 | రిటైల్ ₹ 102 |
| స్కిన్ ₹ 148 | స్కిన్ లెస్ ₹ 168 |




2

## తెలంగాణలో డెంగ్యూ డేంజర్ బెల్స్

కిటకిట లాడుతున్న ఆసుపత్రులు

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

కీలక ఆదేశాలు జారీ చేసిన సీఎస్

## యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా



2

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాదిపాటు పదవిలో కొనసాగనున్నారు
- ఏటా లక్షమందికి 17 రకాల కోర్సుల్లో శిక్షణ

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

అత్యవసరమైతే తప్ప బయటకు రాకండి :అధికారుల సూచన



2



2

## ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

అక్కడికక్కడే ఐదుగురు మృతి

# ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత్ ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)
6 వేల మంది అతిథులు హాజరయ్యారు. అంతకు ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

**దేశాన్ని ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలి..**

ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని ప్రధాని పిలుపునిచ్చారు. "శతాబ్దాల తరబడి దేశం బానిసత్వంలో మగ్గింది. దేశం కోసం జీవితాలనే పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారు. ప్రాణాలర్పించిన మహనీయులకు దేశం రుణపడి ఉంది. స్వాతంత్య్రం కోసం ఆనాడు 40 కోట్ల మంది ప్రజలు పోరాడారు. భారతదేశ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకం. భారత్‌ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలి. తయారీ రంగంలో గ్లోబల్ హబ్ చేయాలి. 2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యం. మనం అనుకుంటే అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. 'వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది కలల తీర్మానం. ప్రపంచానికే అన్నం పెట్టేస్థాయికి భారత్ ఎదగాలి. దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరం. న్యాయవ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలి. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలి. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలి. వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహం. ఈ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పు తెచ్చింది. సర్జికల్ స్ట్రైక్స్ను దేశ ప్రజలు సగర్వంగా స్మరించుకుంటున్నారు.

**మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..**

అభివృద్ధిని బ్లూప్రింట్గా సంస్కరణలు తీసుకొస్తున్నాం. 'నేషన్ ఫస్ట్.. రాష్ట్ర హిత్ సుప్రీం' సంకల్పంతో ముందుకెళ్తున్నాం. బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు అమలు చేశాం. మన బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే బలమైంది. జల్ జీవన్ మిషన్తో 15 కోట్ల మందికి లబ్ధి చేకూరింది. భారత్ చిరుధాన్యాలు ప్రపంచంలో అందరికీ చేరాలి. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పం తీసుకుంది. దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నాం. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించాం. యువతకు నూతన అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని



రంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తాం. భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది. స్వయం సహాయక రంగాలకు ఇప్పటి వరకు రూ.9 లక్షల కోట్ల రుణాలిచ్చాం. కోటి మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తాం" అని ప్రధాని మోదీ అన్నారు.

# మోదీ అరుదైన రికార్డు

**స్వాతంత్ర్య ప్రసంగాల చరిత్రలో అత్యధిక సమయం మాట్లాడిన ప్రధానిగా ఘనత**

**ఢిల్లీ:** 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. అత్యధిక సమయం స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం చేసిన ప్రధానిగా ఘనత సాధించారు. ఈ రోజు ఎర్రకోటపై జాతీయజెండాను ఆవిష్కరించిన అనంతరం 98 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించారు. 2016లో ఇదే రోజున ఆయన 96 నిమిషాల పాటు దేశ ప్రజలకు సందేశం ఇచ్చారు.

- 2014లో ప్రధానమంత్రిగా ఎర్రకోట నుంచి మోదీ తొలి ప్రసంగం చేసిన విషయం తెలిసిందే. ఆ ఏడాది 65 నిమిషాల పాటు ఆయన మాట్లాడారు.
- 2015లో 86 నిమిషాలు ప్రసంగించారు. 2016లో ఏకంగా 96 నిమిషాల పాటు ప్రసంగం చేశారు.
- 2017లో గంట కంటే తక్కువగా 56 నిమిషాల పాటు మాట్లాడారు. ఆ మరుసటి ఏడాది 83 నిమిషాలు ప్రసంగించారు.
- 2019లో రెండోసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత పాల్గొన్న తొలి స్వాతంత్య్ర వేడుకల్లో 92 నిమిషాల పాటు ప్రసంగం చేశారు.
- 2020లో 90 నిమిషాలు, 2021లో 88 నిమిషాలు మాట్లాడారు. 2022లో 74 నిమిషాలు, 2023లో 90 నిమిషాలు దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నేడు 98 నిమిషాల సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఇది ఆయనకు 11వ స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం.
- ప్రధానిగా ఇప్పటివరకు అత్యధిక పంద్రాగస్టు ప్రసంగాలు చేసింది జవహర్లాల్ నెహ్రూ. మొత్తంగా 17 సార్లు ఆయన స్వాతంత్య్ర దినోత్సవం నాడు జాతినుద్దేశించి ప్రసంగించారు.
- మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 16 సార్లు పంద్రాగస్టు నాడు మాట్లాడారు. 1972లో సుదీర్ఘంగా 54 నిమిషాలు ప్రసంగించారు.
- ఇక, మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ కేవలం ఒకే ఒక్కసారి ఎర్రకోట నుంచి ప్రసంగించారు. 1947లో నెహ్రూ, 1997లో గుజ్రాల్ వరుసగా 72, 71 నిమిషాల పాటు మాట్లాడారు. ప్రధాని మోదీ తర్వాత సుదీర్ఘంగా ప్రసంగించింది వీరే.
- మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్ బిహరీ వాజ్పేయీ స్వల్ప ప్రసంగాలు చేశారు. 2012లో మన్మోహన్ సింగ్ 32 నిమిషాలు, 2013లో 35 నిమిషాలు మాట్లాడారు.
- వాజ్‌పేయి 2002లో 25 నిమిషాలు, 2003లో 30 నిమిషాల పాటు ప్రసంగించారు.

# రుణమాఫీ మాట నిలబెట్టుకున్నా

(మొదటి పేజీ తరువాయి)
చేస్తానని హరీశ్‌రావు సవాల్ విసిరారని,. రుణమాఫీ పూర్తైనందున ఆయన రాజీనామా లేదంటే అమరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాసి, తెలంగాణ ప్రజలను క్షమాపణ కోరాలన్నారు. తాను విసిరిన సవాల్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు హరీశ్‌రావు ప్రకటించాలని ఆయన అన్నరు. ఖమ్మం జిల్లా వైరాలో గురువారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ. లక్షన్నర నుంచి రూ.2 లక్షల్లోపు రుణమాఫీ ప్రకటించారు. అనంతరం పలువురికి మూడో విడత రుణమాఫీ చెక్కులను అందించి, ఆ వెంటనే రైతుల ఖాతాల్లో మాఫీ సొమ్ము జమ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా రైతులను రుణ విముక్తులను చేసేందుకు ప్రభుత్వం రూ.31 వేల కోట్లు కేటాయించింది. రూ.లక్ష వరకు రుణం ఉన్న 11 లక్షల 14 వేల 412 మంది రైతులకు జులై 18న రూ.6034 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర లోపు రుణాలున్న 6 లక్షల 40 వేల 823 మంది రైతుల ఖాతాల్లోకి జులై 30న రూ.6190 కోట్లు జమ చేసింది. రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల్లోపు రుణం కలిగిన రైతులకు ఇవాళ మాఫీ ప్రక్రియ పూర్తి చేసింది. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రైతు డిక్లరేషన్‌లో భాగంగా తెలం గాణ రైతులకు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని గుర్తు చేశారు. చెప్పిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేశామని స్పష్టం చేశారు. ఎంత మంది అడ్డుపడినా, రైతు రుణమాఫీ చేస్తున్నామన్న సీఎం, రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు.

**ఖమ్మం రైతులకు అండగా ఉండేందుకే వచ్చా**

ఖమ్మం జిల్లా రైతులకు అండగా నిలిచేందుకే ఈ ప్రాంతానికి వచ్చానని సీఎం పేర్కొన్నారు. రెండు పడక గదుల ఇళ్ల పేరిట పేదలను కేసీఆర్ మోసగించారని విమర్శించారు. ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్న ఆయన, రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందిస్తామని తెలిపారు. పేదలు ఆత్మ గౌరవంతో బతికేలా కార్యక్రమాలు చేపట్టామని, ఆరు గ్యారంటీల అమలుకు నిరంతరం కష్టపడుతున్నామని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్‌ను బద్దలు కొడతాం - బీజేపీని బొందపెడతాం**

'అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్‌కు 39 సీట్లు ఇచ్చిన ప్రజలు, లోక్‌స భలో గుండు సున్నా ఇచ్చారు. వాళ్లను మనుషులుగా గుర్తిస్తే ఒక్క ఎంపీ సీటైనా ప్రజలు ఇచ్చేవారు. సోనియా గాంధీ ఇచ్చిన గ్యారెంటీలను నెరవేర్చే బాధ్యత నాది. మీరు అండగా నిలబడితే బీఆర్ఎస్‌ను బద్దలు కొడతాం. బీజేపీని బొందపెడతాం. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే, బడ్జెట్‌లో గాడిద గుడ్డు ఇచ్చారుస అంటూ సీఎం ఆక్షేపించారు.

# సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్‌ను ప్రారంభించిన సీఎం

## పరవళ్లు తొక్కిన గోదారమ్మ

**విశ్వంభర, ఖమ్మం:** సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా పూసుగూడెం పంప్ హౌస్ ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అక్కడే గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరా వు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. సీతారామ ప్రాజెక్టు పైలాన్ ను సీఎం రేవంత్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

**నీళ్లు కావాలని పదేళ్లుగా అడగని బీఆరెస్ ఎమ్మెల్యేలు: రేవంత్ రెడ్డి**

'బీఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గత పదేళ్లలో ఏనాడు వారి నియోజకవర్గాలకు నీళ్లు కావాలని అడగలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడు నెలలోనే ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు నీళ్లు కావాలని అడుగుతున్నారు. ఇది తమ ప్రభుత్వం విశ్వసనీయతకు నిదర్శనం. ఎందుకంటే మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు వారి మాటలతో అంచనాలు పెంచి నిధులు దోచుకున్నారు అందుకే ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు ఎలాంటి కోరికలు కోరలేదు. పదేళ్ల కాలంలో ఎక్కడ ప్రాజెక్టుల్లో అక్రమాలు బయటపడతాయోనని భయపడి సీడబ్ల్యూసీకి డీపీఆర్ లను పంపించలేదు.



సీతారామ ప్రాజెక్టు విషయంలో కూడా డీపీఆర్ ను కూడా పంపించలేదు. ఖమ్మం జిల్లాలో నాయకులతో సహా రైతులకు కూడా ఈ ప్రాజెక్టును పూర్తి చేసుకోవాలన్న తాపత్రయం కనిపించింది. రూ.18 వేల కోట్ల ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.7 వేల కోట్లను ఖర్చు చేశారు. కానీ ఒక్క గుంట భూమికి కూడా నీరు ఇవ్వలేదు.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టులు రీడిజైనింగ్ పేరు తో వేల కోట్లు దోచుకోవచ్చు ని చూశారు తప్ప ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న ఆలోచన ఏనాడు మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావుల కు లేదని విమర్శించారు. నాలుగేళ్లుగా సీతారామ ప్రాజెక్టును నాన్చారని ధ్వజమెత్తారు. నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని, అదేవిధంగా పాలమూరు జిల్లాలోనూ పరిస్థితులు ఇదే రకంగా ఉన్నాయని అన్నారు. ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో వేల కోట్ల రూపాయల దోపిడీ కి పాల్పడ్డారని ఆరోపణలు చేశారు. నాలుగేళ్లుగా సీతారామ ప్రాజెక్టు పంపులను ఆన్ చేయలేదని అన్నారు. పదేళ్లులో ఈ ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గత పదేళ్లులో రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసిన రైతులకు నీళ్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. హరీశ్ రావు తమ ప్రభుత్వ శ్రమను చులకనగా చేసి మాట్లాడుతున్నారని ఆగ్రహించారు.

**మూడు పంప్ హౌస్‌లు ప్రారంభం**

అంతకు ముందు సీతారామ ప్రాజెక్టు మొదటి పంప్ హౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. అలా గే భద్రాద్రిలోని మూడో పంప్ హౌస్‌ను ములకలపల్లి మండలం కమలాపురంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారం భించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు 1.20 లక్షల ఎకరాలకు ఆయకట్ట ద్వారా సాగునీరు అందనుంది.

# తెలంగాణలో డెంగ్యూ డేంజర్ బెల్స్

**విశ్వభార, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో డెంగ్యూ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. వర్షాకాలం సీజన్ కావటంతో.. డెంగ్యూ తో పాటు వైరల్ ఫీవర్లతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తీవ్ర జ్వరాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. హైదరాబాద్ ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌లో ప్రతి రోజూ వెయ్యి మంది వరకూ రోగులు అవుట్ పేషెంట్ విభాగానికి వస్తున్నారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి కూడా రోగులతో కిటకిటలాడుతుంది. గత కొన్ని రోజులుగా తెలంగాణలో డెంగ్యూ కేసులు భారీగా నమోదవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2,800కు పైగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 1100కు పైగా కేసులు నమోదయినట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో 287, మేడ్చల్ జిల్లాలో 268, సూర్యాపేట జిల్లాలో లో 217 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ఇక చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తుండగా.. వారిని కూడా కలుపుకొంటే కేసుల సంఖ్య డబుల్ అయ్యే అవకాశం ఉంది. ఇక డెంగ్యూ ఎఫెక్ట్‌తో ప్రభుత్వాస్పత్రుల్లో పడకల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎస్ శాంతి కుమారి గురువారం కీలక ఆదేశాలు జారీ చేశారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని అరికట్టడంపై కలెక్టర్లు, ఉన్నతాధికారులు దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో తనిఖీలు చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యం, మందులు నిర్ణీత ధరలకే అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు.

**డెంగ్యూ జ్వరం రాకుండా జాగ్రత్తలు**

ఒంటిపై దద్దుర్లు, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, రక్తస్రావం, కంటి వెనుక నొప్పి, వారం రోజులైన జ్వరం తగ్గకపోవటం తదితర లక్షణాల్లో ఏవైనా రెండు, అంతకంటే ఎక్కువ కనిపించాయంటే.. దాన్ని డెంగీ జ్వరంగా భావించాల్సిందే. వెంటనే హాస్పిటల్‌కి వెళ్లి ఎన్ ఎస్ ఐ లేదంటే డెంగ్యూ టెస్టు చేయించుకోవాలి. ఈ పరీక్షలో పాజిటివ్ వస్తే డెంగీ జ్వరం నిర్ధారణ అయినట్లే. వెంటనే రక్త నమూనాలు ఇచ్చి కంప్లీట్ బ్లడ్ పిక్చర్ పరీక్ష చేయించుకోవాలి. ఈ టెస్ట్ ద్వారా శరీరంలో ప్లేట్‌లెట్లు సంఖ్య ఎంత ఉందో తెలుస్తుంది. ఆరోగ్యంగా ఉండేవారిలో 1.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ప్లేట్‌లెట్లు ఉంటాయి. డెంగీ జ్వరం బారిన పడినవారిలో ఈ ప్లేట్‌లెట్ల సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. అలా తగ్గిన వారు వెంటనే హాస్పిటల్‌లో జాయిన్ కావాలి. డెంగ్యూ జర్వానికి ప్రస్తుతానికి కచ్చితమైన మందులంటూ లేవు. ఇన్‌ఫెక్షన్లు రాకుండా యాంటీబయోటిక్స్, ఎలక్ట్రోలైట్స్, ఐవీ ఫ్లూయిడ్స్ అందిస్తారు. ఈ జ్వరం దోమ కాటు వల్ల వస్తుంది కాబట్టి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కుండీలు, టైర్లు, తాగేసిన కొబ్బరి బోండాలు, ఉపయోగించని పాత్రలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

# ప్రపంచానికి ముఖద్వారంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)
తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు అంగీకరించిందని పేర్కొన్నారు.

**నెహ్రూ దార్శనికత ఫలితాలే ఇవి**

ప్రపంచ చరిత్రలోనే అహింసనే ఆయుధంగా మలిచి చేసిన మహా సంగ్రామం మన స్వాతంత్య్ర పోరాటమని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "నెహ్రూ దార్శనికత ఫలితంగానే దేశం ఈ స్థాయిలో ఉంది. ఆయన ప్రారంభించిన ప్రాజెక్టులతోనే దేశం సస్యశ్యామలమైంది. బీహెచ్ఎల్., మీధాని వంటి పరిశ్రమలను ఆయన స్థాపించారు. లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ సాగులో విప్లవం తెచ్చారు. దేశానికి కాంగ్రెస్ చేసిన సేవలకు ఇవి కొన్ని ఉదాహరణలే "అని పేర్కొన్నారు.

**రుణమాఫీ కాని వారిని గుర్తించి అందజేస్తాం**

"వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా రుణమాఫీ చేస్తున్నాం. రుణమాఫీ అసాధ్యమని కొందరు వక్రభాష్యం చెప్పారు. రూ.2 లక్షల వరకు అమలు చేసి చూపిస్తున్నాం. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కావడం లేదు. అలాంటి వారిని గుర్తించి అందజేస్తాం. కలెక్టరేట్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తాం. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు ఇప్పటికే అనులు చేశాం. ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చాం. దీని పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికీకరణకు కట్టుబడి ఉన్నాం.

**భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం**

అర్హులైన అందరికీ రైతు భరోసా అందిస్తాం. గత ప్రభుత్వం అనర్హులకు రైతుబంధు ఇచ్చింది. త్వరలో రైతు భరోసా పథకాన్ని ప్రారంభించబోతున్నాం. సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు.. రూ.500 బోనస్ చెల్లిస్తాం. దీని కోసం 38 రకాల వరి ధాన్యాలను గుర్తించాం పెండింగ్ ధరణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించాం. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం తీసుకురావాలని భావిస్తున్నాం. డ్రగ్స్ నియంత్రణకు కఠిన నిర్ణయాలు తీసుకున్నాం. సైబర్ మోసాలు, నేరాల బారిన పడిన వారికి సహాయం కోసం 1950 నంబర్ ఏర్పాటు చేశాం. త్వరలో విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అంగన్వాడీలను ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నాం. ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మిస్తాం. ఇటీవలే స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశాం. అది విప్లవాత్మక మార్పులకు మలుపు కాబోతోంది. స్కిల్ వర్సిటీకి ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్ గా నియమించాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

**విశ్వంభర, హైదరాబాద్:** యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ఇటీవల అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన విషయం తెలిసిందే. ఇక, గవర్నర్ ఆమోద ముద్ర కూడా లభించడంతో న్యాయ శాఖ గెజిట్ జారీ చేసింది.తాజాగా, ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆనంద్ మహీంద్రా ఏడాదిపాటు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.రాష్ట్రంలోని లక్షలాది మంది యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.ఏటా లక్ష మందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో ఈ వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**విశ్వంభర, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంచోటు చేసుకుంది. శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ పై ఈ ప్రమాదం జరిగింది. పెద్ద గోల్కొండ ఔటర్ రింగు రోడ్డుపై తుఫాన్ వాహనాన్ని అతివేగంతో వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. కాగా, తుక్కుగూడ నుంచి శంషాబాద్ వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం.

# 223 కొత్త పంచాయతీలకు గెజిట్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)
జిల్లాలకు అందించారు . ఇప్పటి వరకు 12,769 గ్రామ పంచాయతీలుండగా కొత్తగా 223 పంచాయతీలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 12,992 పంచాయతీలకు చేరాయి. వీటిలో ములుగు జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్టంలో ప్రస్తుతం పంచాయతీల సంఖ్య 12,991కు చేరింది.

# మీ రుణమాఫీ పచ్చి అబద్ధం అని తేలిపోయింది

(మొదటి పేజీ తరువాయి)
రోజు కానుగా డిసెంబరు 9 నాటికి రూ.40వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పారు. అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికలకు ముందు మరో నాటకానికి తెరలేపారు. సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్ధమే అతని లక్షణం. మేము మొదటి దఫాలో రూ. లక్ష రుణమాఫీ చేస్తేనే 35 లక్షల మంది రైతులకు రూ. 17వేల కోట్లు అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటారా? రూ.17,869 కోట్లు మాత్రమే అవుతాయా? ఈ ఒక్క విషయంతోనే మీ రుణమాఫీ పచ్చి అబద్ధం అని తేలిపోయింది. మీరు దగా చేశారన్నది స్పష్టంగా తేలిపోయిన తర్వాత రాజీనామా ఎవరు చేయాలి?.రేవంత్‌రెడ్డి ఏ దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పారో ఆ దేవుళ్లందరి వద్దకు స్వయంగా నేనే వెళ్తా. ఆయన చేసిన తప్పు తెలంగాణ ప్రజలకు ముప్పుగా మారొద్దని ప్రార్థిస్తా" అని హరీశ్‌రావు తెలిపారు.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పాటు, ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెలవు రోజు కావడంతో సాయంత్రం ఇంటి నుంచి బయటికొచ్చిన నగరవాసులు తడిసి ముద్దయ్యారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, మధురానగర్, సనత్‌నగర్, ఈఎస్ఐ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, గాంధీ నగర్, కవాడీగూడ, దోమలగూడ, జగద్గిరిగుట్ట, షాపూర్, జీడిమెట్ల, బాలానగర్, సుచిత్ర, గుండ్ల పోచంపల్లి, సూరారం, బహదూర్‌పల్లి, కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, కేపీహెచ్‌బీ కాలనీ, ఖైరతాబాద్, లక్డీకాపూల్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బషీర్‌బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, ఆల్వాల్, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట్, చిలకలగూడ, మారేడ్‌పల్లి, మేడ్చల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, గండిమైసమ్మ, మలక్ పేట్, చంపాపేట్, సైదాబాద్, చైతన్యపురి, సంతోష్ నగర్, కొత్తపేట, సరూర్ నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది.

**అవసరమైతేనే బయటకు రండి**

భారీ వర్షం కురవడంతో జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. అత్యావసరసమైతే తప్ప ప్రజలు ఇల్లు విడిచి బయటకు రావొద్దని సూచించారు. వర్షానికి సంబంధించి ఏమైనా అత్యవసర సహాయం అవసరమైతే 040-21111111, 9000113667 ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

**మరో మూడు రోజులపాటు వర్షాలు**

మరోవైపు రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం అక్కడక్కడా కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఈ జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# అర్చకులు పద్మనాభాచార్యుల ఆధ్వర్యంలో ఖగోళ యాత్ర



**విశ్వంభర, హైదరాబాద్:** భద్రాద్రి శ్రీ రామా టెంపుల్ ఆఫ్ యూ.ఎస్.ఏ వారు, అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటా సిటీలోని శ్రీ భద్రాద్రి సీతా రాముల ఆలయ నిర్మాణ సంకల్పం చేసిన శ్రీ అర్చకం పద్మనాభాచార్యుల ఆధ్వర్యంలో ఖగోళ యాత్ర మొదలైంది. గురువారం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి దివ్య సాకేతంలో 10 మంది అర్చక స్వాములు సంకల్ప దీక్ష తీసుకోవటంతో ఈ ఖగోళ యాత్ర ప్రారంభం అయ్యింది. ఈ అద్భుత యాత్ర మొదటగా ఈ నెల 16న అయోధ్యలో అర్చక స్వాములు హోమం నిర్వహిస్తారు. 17న సీతా రామచంద్రుల శాంతి కళ్యాణం అదే రోజున శోభా యాత్ర చేసుకుని అర్చక బృందం శ్రీ సీతారాముల పరివారంతో తూర్పున ఉన్న కాంబోడియా కి చేరి, అక్కడ నుంచి ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా, అర్జెంటీనా, అమెరికాలోని కాలిఫోర్నియా, అలాస్కా, జపాన్ ఐస్లాండ్, దిక్కులకు ఆకాశ మార్గంలో ప్రయాణించి ఈ వేడుక జరుగనున్నది. వెళ్లిన ప్రతి దిక్కులోనూ, నక్షత్ర శాంతులు, హోమం, శాంతి కళ్యాణం నిర్వహిస్తారు. భారతదేశాన్ని కేంద్రంగా చేసుకొని 8 దిక్కులలోని వివిధ దేశాలను శ్రీ సీతారామాంజనేయ స్వామి విగ్రహాలతో సెప్టెంబర్ 17న భద్రాద్రి రామాలయంకు చేరుకొని శాంతి కళ్యాణం నిర్వహించి కార్యక్రమాన్ని ముగిస్తారు. ఖగోళ యాత్రలో అర్చకులు, వేద పండితులు జడ కాశీవిశ్వనాధం, భద్రాద్రి సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు పొడి చేటి సీతారామాచార్యులు, బెంగళూరు నుండి ఐదుగురు అర్చకులు, అమెరికాలో నిర్మాణంలో వున్నా భద్రాద్రి శ్రీరామ టెంపుల్ అఫ్ యూ ఎస్ ఏ అధ్యక్షులు సరిపల్లి రావ్, పద్మ, దంపతులు, రామాయణం పద్మ, నగరానికి చెందిన ట్రస్ట్ బోర్డు డైరెక్టర్స్ శైలజ, అరుణ, పాల్గొన్నారు.

# పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



**విశ్వంభర, హైదరాబాద్:** పంద్రాగస్టు సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యాలయంలో పుస్తక ప్రదర్శనను గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బుక్ ట్రస్ట్ ప్రగతిశీల సాహిత్యానికి కేంద్ర బిందువు అన్నారు. తెలంగాణ చరిత్ర సంస్కృతి ఉద్యమాలకు సంబంధించిన సాహిత్యాన్ని విస్తృతంగా తీసుకురావాల్సిన అవసరం మరింత ఏర్పడిందన్నారు. సాహిత్యం అనేది సమాజంలో భిన్న కుల మతాలను సమైక్యపరుస్తుందని అన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో సాహిత్యంలో వివిధ ప్రక్రియలకు సంబంధించిన పుస్తకాలతో పాటుగా విద్యార్థుల పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా పుస్తకాలు ప్రదర్శనకు ఉంచడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రచయిత సామిడి జగన్ రచించిన భారతదేశ విప్లవ కవి గద్దర్ గ్రంథాన్ని డాక్టర్ రియాజ్‌కు బహుకరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాజు, డిప్యూటీ డైరెక్టర్ హరిశంకర్, సామాజిక కార్యకర్త జీ రాములు, సీనియర్ జర్నలిస్ట్ కొండూరు వీరయ్య, కవి తంగిరాల చక్రవర్తి, సామిడి జగన్ రెడ్డి, నరసింహ, గురుమూర్తి, జిల్లా నరేష్, అలకనంద, వాగ్దేవి, సుధాకర్ పాల్గొన్నారు.




78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం చైతన్యపురిలో వీ3 న్యూస్ ఛానల్ చైర్మన్, విశ్వంభర దినపత్రిక సీఎండీ కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధులకు ఘన నివాళులర్పించారు. ఆయన వెంట వీ3 ఛానల్ చీఫ్ ఎడిటర్ డా. మంధాని భరత్, హెచ్ఆర్ ఎన్ రమేశ్, మహేందర్ యాదవ్, కే వీరేందర్, వీ శ్రీదర్, ఏ పురేంద్‌నేత, వై కృష్ణారెడ్డి, వీ3 సిబ్బంది తదితరులు ఉన్నారు.

- విశ్వంభర, చైతన్యపురి



చైతన్యపురిలోని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత్‌చారి జయంతిని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన వెంట ఆ సంఘం సభ్యులు ఎన్ రమేశ్, దాము మహేందర్ యాదవ్, కే వీరేందర్, వీ శ్రీదర్, ఏ పురేంద్‌నేత, వై కృష్ణారెడ్డి, సీహెచ్ విద్యాసాగర్, విజయ్ తదితరులు ఉన్నారు.

- విశ్వంభర, చైతన్యపురి



నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో ప్రముఖ న్యాయవాది చలకాని వెంకట్ యాదవ్ కూతురు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వీ3 న్యూస్ ఛానల్ చైర్మన్, విశ్వంభర దినపత్రిక సీఎండీ కాచం సత్యనారాయణ, దాము మహేందర్ యాదవ్.

- విశ్వంబర, నాగోల్



సెయింట్ మేరీ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అలేక్య, విజయ, మైథిలి సరిత, మాయ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- విశ్వంభర, అంబర్‌పేట్

# వృద్ధ దంపతులకు సన్మానం

**విశ్వంభర, వనస్థలిపురం :** 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ వనస్థలిపురం వారు 75 సంవత్సరాలు నిండిన వృద్ధ దంపతులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, శ్రీధర్ రావు, సాంబశివరావు, శ్రీనివాస్ రావు, శ్రీహరి గోవిందరాజులు, భాస్కర్ పాల్గొన్నారు.









# అజాత శత్రువు అటల్ జీ

## ఆగస్టు 16... వాజ్‌పేయి వర్ధంతి

రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న గొప్ప నాయకుడు వాజ్ పేయి. ప్రజా సేవ కోసం బ్రహ్మచారిగా ఉండిపోయి... తన జీవితం మొత్తం దేశం కోసం అంకితం చేశారు. రెండు సీట్ల పార్టీని దేశ రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీగా మలచిన అపర చాణక్యుడు.పార్లమెంట్ సాక్షిగా నెహ్రూలాంటి నేతల్ని సైతం గడగడలాడించారు. వేడెక్కించే ప్రసంగాలు చేయడంలోనే కాదు.. హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్ట సభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు.కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపార్టీలను దీటుగా ఎదుర్కొని.. మిత్రపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అధికారం హస్తగతం చేసుకున్న నేత వాజ్‌పేయి. ప్రధానిగా పూర్తి పదవీకాలం పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర నేతగా వాజ్‌పేయి నిలిచారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్నివర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన.

**విద్యాభ్యాసం**

అటల్ బిహారీ వాజ్‌పేయి డిసెంబర్ 25 1924 న గ్వాలియర్ లోని ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణబిహారీ వాజ్‌పేయి. ఆయన తాత పండిట్ శ్యాం లాల్ వాజ్‌పేయి వారి పూర్వీకుల నివాస ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ లోని బటేశ్వర్ నుండి గ్వాలియర్ లోని మోరీనాకు వలస వెళ్ళాడు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజ్‌పేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, కవి. వాజ్‌పేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేశాడు. గ్వాలియర్ విక్టోరియా కళాశాల (ప్రస్తుతం లక్ష్మీబాయి కళాశాల)లో చేరి హిందీ, ఆంగ్లం, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్ట భద్రుడయ్యాడు. కాన్పూరు లోని దయానంద ఆంగ్లో వైదిక కళాశాలనుండి రాజనీతిశాస్త్రంలో ఎం.ఎ పట్టాను పొందాడు. ఎం.ఎ డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

**సామాజిక కార్యశీలత**

వాజపేయి గ్వాలియర్లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన 1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)లో చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 1940-44 లలో అధికార్ల శిక్షణ కేంద్రానికి హాజరయ్యాడు.

### భారతీయ జనసంఘ్‌లో ప్రస్థానం

1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ అనే రాజకీయ పార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజ్‌పేయిని ఆర్.ఎస్.ఎస్ నియమించింది. ఇది ఆర్.ఎస్.ఎస్ స్ఫూర్తితో పనిచేస్తున్న రాజకీయ పార్టీ. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పార్టీ ఉత్తర విభాగానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే జనసంఘ్ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అనుయాయిగా, సహాయకునిగా మారాడు. 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్ధాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించారు. ఆయనకు గల వాగ్ధాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ మరణానంతరం జనసంఘ్ మొత్తం బాధ్యత, యువ వాజపేయిపై పడింది. 1968 లో జనసంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీ లతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. 1975, 1977 ల మధ్య, భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధాని, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు అరెస్టు అయ్యాడు. 1977 లో సంఘ సంస్కర్త జయప్రకాశ్ నారాయణ్, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడటానికి, అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఇచ్చిన పిలుపు మేరకు, వాజ్‌పేయి జనసంఘ్‌ను క్రొత్తగా ఏర్పడిన సంకీర్ణ కూటమి, జనతాపార్టీలో విలీనం చేశాడు. 1977 సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ విజయం తరువాత ఆయన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశాడు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్య సమితి యొక్క సర్వప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు. 1979లో జనతా ప్రభుత్వం కూలిపోయే నాటికి వాజ్‌పేయి, స్వతంత్రంగా గౌరవప్రథమైన రాజకీయవేత్తగా, అనుభవజ్ఞుడైన నాయకునిగా ఎదిగాడు. వాజ్‌పేయి, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల నుండి వచ్చిన తన సహచరులను, ముఖ్యంగా దీర్ఘకాల స్నేహితులైన ఎల్.కె.అద్వానీ, భైరాన్ సింగ్ షెకావత్ లను కలుపుకొని 1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా పనిచేశారు. జనతా ప్రభుత్వం తర్వాత వచ్చిన ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వానికి బలమైన విమర్శకునిగా అవతరించాడు.


ఆయన 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయ శాస్త్ర విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. రాష్ట్రీయ స్వయంసేయక్ సంఘ్ విస్తారక్ గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజ్‌పేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడుపుతున్న "రాష్ట్రధర్మ" (హిందీ మాసపత్రిక), "పాంచజన్య" (హిందీ వారపత్రిక) పత్రికలలోను, స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి దిన పత్రికలలోనూ పనిచేయటం ప్రారంభించాడు. వాజపేయి జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజ్‌పేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయ మేర్పడింది.

**మూడు సార్లు ప్రధాన మంత్రిగా..**

1995 నవంబరులో ముంబాయిలో జరిగిన బి.జె.పి సమావేశంలో బి.జె.పి అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వానీ వాజ్‌పేయిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. 1996 మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బి.జె.పి విజయం సాధించింది. వాజ్‌పేయి 1996 నుండి 2004 ల మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు.

వాజపేయి ప్రభుత్వం యేర్పడిన నెలరోజులలోనే ప్రోఖ్రాన్ అణు పరీక్షలు జగిపారు. ఢిల్లీ-లాహోర్ బస్సును 1999 ఫిబ్రవరిలో ప్రారంభించారు. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే - జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలోను, మరికొన్ని సరిహద్దుల వద్దనూ జరిగింది. మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు. నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనష వాజ్‌పేయి అభిమాన ప్రాజెక్టులు చేపట్టాడు.2001 లో వాజపేయి ప్రభుత్వం, ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధి లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ అనే ప్రసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

2005 డిసెంబర్ నెలలో వాజపేయి క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రిమిస్తున్నట్లు ప్రకటించి, "ఇకనుండి లాల్ కృష్ణ అద్వానీ, ప్రమోద్ మహాజన్‌లు భారతీయ జనతా పార్టీకి రామలక్ష్మణుల వంటివారు" అని ప్రకటించాడు.భారతదేశ రాజ్యసభలో అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో వాజపేయిని రాజకీయ భీష్మునిగా అభివర్ణించారు. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఆయన శత్రువులు కూడా విమర్శించరు. 'అజాత శత్రువు, సర్వప్రియుడు, సర్వమాన్య' లాంటి ఉపమానాలను ఆయన పేరుతో జోడిస్తారు. అనారోగ్య కారణాలతో అటల్ జీ 2018 ఆగస్టు16న మృతి చెందారు. ఆటల్ జీ జన్మదినమైన డిసెంబర్ 25 ను భారత ప్రభుత్వం సుపరిపాలనా దినంగా ప్రకటించింది.





-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# వరదాయిని వరలక్ష్మీ దేవి

"నమస్తేస్తు మహామాయే, శ్రీపీఠే సుర పూజితే; శంఖు చక్ర గదా హస్తే, మహాలక్ష్మి క నమోస్తుతే". శంఖ చక్ర గద ధారణియైన మహా లక్ష్మి దేవి సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి లాంటి అష్టైశ్వర్య ప్రదాయిని. అష్టసంపదలు ఒసంగే జగన్మంగళ దాయిని. అష్టైశ్వర్యాలు కలుగజేసే రూపం వరలక్ష్మిగా ఆరాధనీయం. కొలిచిన వారికి కొంగు బంగారమై వరాలనిచ్చే జగజ్జనని వరలక్ష్మి.

అన్ని లక్ష్మి పూజల కన్నా, వరలక్ష్మీ పూజ ఉన్నతమైనదని శాస్త్ర వచనం. వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్య. వైకుంఠ నాథుని జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో కూడిన పౌర్ణమి కల శ్రావణ మాసంలో వరలక్ష్మిని ఆరాధిస్తే, విశేష ఫలమని భావన. ఆయురారోగ్య ఐశ్వర్య సంతోషాదులు లక్ష్మీదేవిని అత్యంత ప్రియమైన శుక్రవారం పూజిస్తేనే కలుగుతాయని శ్రీ సూక్తం వివరిస్తున్నది. వరలక్ష్మిని షోడశోపచార పూజలతో సేవిస్తే, అష్ట ఐశ్వర్యాలు, అయిదవతనం, సత్సంతానం, సంతానాభివృద్ధి కలకాలం ఉండగలవని శాస్త్ర వచనాలు. సకల కోరికెలు ఈడేరాలని, సర్వమంగళ సంప్రాప్తి కలగాలని, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని ఈ వ్రతాన్ని వివాహితులు వ్రతాన్ని ఆచరిస్తారు. వరాలు యిచ్చే దేవతగా వరలక్ష్మి దేవిని కొలుస్తారు. ఈ పూజలు ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారు. ఈ పండగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. శ్రావణ శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు అరు దెంచే శుక్రవారం సువాసినులు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించడం హిందూ సంప్రదాయం మంచి భర్త, సత్సంతానం కలగాలని అమ్మాయిలు పూజిస్తారు. ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మి పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచు కుంటారు. దేవతను పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు... సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. కైలాస నాథుడు, పార్వతీదేవికి వరలక్ష్మి వ్రతాచరణ గురించి వివరించినట్లు స్కంద పురాణంలో ఉంది. లోకంలో స్త్రీలు సక లైశ్వర్యాలు, పుత్రపౌత్రాదులను కలిగేందుకు ఏదైనా వ్రతం గురించి తెలపాలని పార్వతీ దేవి, పరమ శివుని కోరగా, వరలక్ష్మి వ్రతాన్ని అభయంకరుడుడైన శంకరుడు వివరించారు. ఈ సందర్భంలోనే భర్తపట్ల ఆదరాన్ని అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రదర్శించిన మగధ రాజ్య అంతర్గత కుండిన నగర వాసియైన పరమ సాధ్వి చారుమతి ఉత్తమ ఇల్లాలిగా ప్రవర్తించిన నేపథ్యాన్ని వివరించారు. మహాలక్ష్మిని చారుమతి చిత్తశుద్ధితో పూజించిన క్రమంలో వర లక్ష్మి ఆమెకు స్వప్న సాక్షాత్కారమై, శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం తనను ఆరాధిస్తే, కోరిన వరాల్ని ఒసంగెదనని వరమిచ్చినట్లు కథనం. ముందుగా గణపతిని పూజించి కలశం లోనికి అమ్మవారిని ఆవాహన గురించి షోడశోపచార పూజ, అథాంగ పూజ చేయాలి.

*"సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే*
*శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే"!!*

అంటూ పూజ చేయాలి. అష్టోత్తర శత నామాల యుక్త ధూప, దీప, నివేదన, తాంబూలాలను సమర్పించి, కర్పూర నీరాజనం, మంత్రపుష్పం, మంగళ హారతి సమర్పణ గావించి, తొమ్మిది దారపు పోగులతో తొమ్మిది ముడులను వేసి, మధ్యన పంచ పుష్పాలు కట్టి తోర గ్రంథి చేసి తోర గ్రంధి పూజ, తోర గ్రంధి మంత్ర పఠనం చేయాలి. "లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం, దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం, శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ, బ్రహేంద్ర గంగాధరాం, త్వాం త్రిలోక్య కుటుంబినీం సరసిజాం, వందే ముకుంద ప్రియాం" అని స్తుతించాలి. నవ సూత్ర ధారణను కుడి చేతికి చేయాలి. ఫలభక్ష్య పానీయ పాయసాదులను అమ్మవారికి సమర్పించి, చివరగా వాయన దాన మంత్రంతో ముత్తయిదువను మహాలక్ష్మిగా భావించి, తాంబూలం అందించాలి. భక్తితో వేడుకొంటే వరాలందించే తల్లి వరలక్ష్మి దేవి. వరలక్ష్మి వ్రతం చేసినను, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు కలిగుతాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు వివరించినట్లు పురాణ కథనం. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మివ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాచరణ వల్ల లక్ష్మీదేవి కృప కలిగి సకల శుభాలు కలుగుతాయి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.



# అభినవ పోతన వానమామలై...

## నేడు వరదాచార్యులు జయంతి



తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి వానమామలై. అమూల్య సాహిత్య సంపదను తెలుగువారి కందించిన అద్వితీయ కవితా విశారదుడు, వాగీశ్వరీ మంత్ర సిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్య. ఒక మహాకవి పోతన చరిత్రను మరోకవి గ్రంథస్థం చేయడం విశేషమే మరి.

వానమామలై (1914-1984), 1914 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో పండిత కుటుంబంలో జన్మించారు. రైతు కుటుంబంలో జన్మించిన వరదాచార్యులు ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి సంస్కృతాంధ్ర సాహిత్యం, తార్కికం, వేదాంతం, వ్యాకరణాలను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ, ద్రవిడం, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు సాధించారు. హరికథాగానంలో ప్రావీణ్యతను సంతరించు కున్నారు. ఈయన అన్నలైన వానమామలై వేంకటాచార్యులు, లక్ష్మణాచార్యులు, జగన్నాథా చార్యులు కూడా సాహిత్యకారులే. కాళోజీ, పల్లా దుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజువంటి సాహితీ దిగ్గజాలు మడికొండకు చెందిన వారేకాక, ఆయన ఆత్మీయులు కూడా.

ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తునుండి విశారద పట్టా పుచ్చుకున్నారు. విశారద పూర్తయ్యాక చెన్నూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ చేశారు. చెన్నూరులో వేదపాఠశాల నెలకొల్పారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు శాసనమండలికి నామినేట్ చేయగా 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు.

1968లో పోతన చరిత్రం గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యత్వము, 1973లో కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారతీ సాహిత్య సమితి వారిచే గండపెండేరం, స్వర్ణ కంకణం, రాత్నాభిషేకం,1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం, వారణాసి వారిచే డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టా పొందారు.

అభినవ కాళిదాసు, మహాకవి శిరోమణి, ఆంధ్ర కవిత ఉత్ప్రేక్ష చక్రవర్తి, అభినవ పోతన, ఆంధ్ర కవివతంస, మధురకవి, కవి కోకిల, కవిశిరో వతంస తదితర బిరుదాంకితులైనారు. తెలంగాణ ప్రజలను జాగృతం చేసేందుకు హైదరాబాద్ రాజ్యంలో నిజాం నియంతృత్వ పాలనను వర్ణిస్తూ అనేక పాటలు, పద్యాలు రాశారు. పౌరాణికుడిగా ప్రదర్శనలు ఇచ్చారు. హరికథలు, పురాణాలు చెప్పారు.

"పోతన చరిత్రము" రాసి "అభినవ పోతన"గా వాసికెక్కిన వానమామలై తెలంగాణా కవులలో అగ్రగణ్యుడు, అపూర్వ సాహితీ దురంధరుడు.... దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితులు, ఆచార్య సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు,

ఎన్నో గేయకృతులు, వ్యాసాలు, నాటకాలు, బుర్రకథలు ఎన్ని వ్రాసినా.. తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని సముపార్జించి పెట్టింది "పోతన చరిత్రము".

మహాభాగవత కర్త మహాకవి బమ్మెర పోతన్న జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన ఘనత మన వరదన్నదే.అలా తెలుగు రచయితల సంఘం ఆయనకు "అభినవ పోతన" బిరుదునిచ్చి సత్కరించింది. ఆయన వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడింది తాత ముత్తాతల ఊరైన చెన్నూరు లోనే.'వరదన్నకు చిన్ననాటనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు. మంథని వాసి, మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు వాగీశ్వరి మంత్రోపదేశం చేయగా, కాజీపేట సమీపంలోగల మెట్టుగుట్టపై ఎనభైరోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందినట్లు చెపుతారు.

ఆయన శతజయంతి ఉత్సవాలు 18-8-2011 నుండి 18-8-2012 వరకు జరిగాయి. ఈ సందర్భంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ లోని జగన్నాథ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు.క్షయవ్యాధి పీడితుడై, ఊపిరి తిత్తులకు పది సార్లు శస్త్రచికిత్సతో ఒక ఊపిరితిత్తి తోనే కడదాకా జీవించి,1984, అక్టోబరు 30నఈ లోకాన్ని వీడి వెళ్ళారు.



## ఎడుపాయలలో వనదుర్గాభవాని దివ్య దర్శనం

**విశ్వంభర, చేగుంట :** గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడుపాయల వనదుర్గాభవాని మాత అమ్మవారి విశేష అలంకరణ, దివ్య దర్శనం కనువిందుగా కనిపించే సరికి వచ్చిన భక్తులు ఎంతో సంతోషంతో దర్శనం చేసుకున్నారు.

## శ్రీదా హాస్పటల్ ప్రారంభం



**విశ్వంభర, వనస్థలిపురం :** శ్రీదా హాస్పిటల్‌ను హస్తినాపురం నాగార్జునసాగర్ రోడ్డులో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అలేఖ్య రెడ్డి మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ఈసీజీ, టు డికో టిఎంటి, 24 గంటల వైద్య సౌకర్యం. అడ్వాన్స్ లేబరేటరీ సర్వీస్, ఫార్మసీ అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఇంత చక్కటి వాతావరణంలో నూతన పద్ధతిలో నిర్మించిన హాస్పటల్‌ను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దవాఖాన సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## వావ్ కలర్స్ ప్రారంభోత్సవం



**విశ్వంభర, వనస్థలిపురం :** వావ్ కలర్ వస్త్రాలయం ఆనంద్‌నగర్ బండ్లగూడ నాగోల్‌లో ముఖ్యఅతిథిగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ హాజరై ప్రారంభించారు. ఇక్కడి పరిసర ప్రాంతాల ప్రజలకు తమ షాపులో దుస్తువులను సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ నాగోల్ కార్పోరేటర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాచకొండ పి శ్రీధర్ రెడ్డి, నిర్వాహకులు ఎల్ విజయరెడ్డి, ఎల్ ఉపేందర్ రెడ్డి, జి కవితా రెడ్డి, జి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యానికి క్రమశిక్షణ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు



**విశ్వంభర, హయత్ నగర్:** పెద్ద అంబర్పేట్ లోని సత్యం టెక్నో స్కూల్లో 78వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంకు సత్యం టెక్నో స్కూల్ చైర్మన్ సత్యం హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్యానికి క్రమశిక్షణ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని ఉత్తమ పౌరులుగా, బాధ్యత గల పౌరులుగా ఈ దేశానికి సేవ చేయడం ద్వారా మన దేశానికి స్వాతంత్రం సాధించి పెట్టిన స్వాతంత్ర సమరయోధులకు ఘన నివాళులు అర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో సత్యం టెక్నో స్కూల్స్ డైరెక్టర్ అరవింద్ బాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేత

**విశ్వంభర, చండూరు :** భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ పోలీస్ శాఖ మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉపన్యాస పోటీల కార్యక్రమంలో నల్గొండ జిల్లా స్థాయి మూడవ బహుమతిని గాంధీజీ విద్యాసంస్థల పదవ తరగతి విద్యార్థిని ఎన్. హన్సిక సాధించింది. నల్గొండ కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పహార్ విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డా.కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలకు భానిసలుగా అవుతున్నారని అలాంటి యువత మత్తు పదార్థాల నివారణ కొరకు మిషన్ పరివర్తన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఉపన్యాస పోటీల్లో మూడవ స్థానం తమ విద్యార్థి అందుకోవడం చాలా గొప్పగా ఉందని అన్నారు. యువత మత్తు వదిలి దేశ పురోగతికి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి హన్సికను గాంధీజీ విద్యా సంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



### తెలంగాణ రాష్ట్ర సర్వోముఖాభివృద్ధికి

# ప్రతి ఒక్కరు కృషి చేయాలి



విశ్వంభర, నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర సర్వోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరు విష్ చేయాలని రాష్ట్ర రోడ్లు భవనముల మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు.. 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సందేశం ఇస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటలలోనే ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను తమ ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు.ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో రెండు కోట్ల 27 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, ఇందుకు ఆర్టీసీ కి 98 కోట్ల 26 లక్షల రూపాయలు లబ్ధి పొందిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పరిమితిని 5 నుండి 10 లక్షల కు పెంచడం జరిగిందని, దీని ద్వారా జిల్లాలో 33 వేల 312 మంది చికిత్సలు చేయించుకొని లబ్ధి పొందగలిగారని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేయనున్నామని, 3500 చొప్పున జిల్లాలో మొత్తం 21 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నామని తెలిపారు.500 రూపాయలకే ఎల్పిజీ సిలిండర్ పథకం కింద రెండు లక్షల 38వేల 251 మందికి నాలుగు లక్షల ఇరవై మూడు వేల 390 సిలిండర్ లను పంపిణీ చేయడం జరిగిందని, ఇందుకు 12 కోట్ల 41 లక్షల సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు.గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు వినియోగదారులకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం అందిస్తున్నదని, ఇందులో భాగంగా నల్లగొండ జిల్లాలో రెండు లక్షల 13390 జీరో బిల్లులు జారీ చేయడం జరిగిందని, ఇందుకుగాను ప్రభుత్వం 36 కోట్ల 15 లక్షల రూపాయల సబ్సిడీని ఇచ్చిందని తెలిపారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా బ్యాంకుల ద్వారా రెండు లక్షల రూపాయల వరకు రుణాలు పొందిన రైతుల రుణమాఫీ ప్రకటించిందని, ఇందులో భాగంగా నల్లగొండ జిల్లాలో లక్ష 71 788 మంది రైతులకు 1421 కోట్ల 35 లక్షల రూపాయలు రుణమాఫీ అయిందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో 672 దరఖాస్తులకు గాను 595 పరిష్కారం అయ్యాయని, జిల్లాలో 7814 దరఖాస్తులకు గాను ,5785, మండలాలలో 6549 దరఖాస్తులకు గాను, 5317 పరిష్కారం అయ్యాయని తెలిపారు .సాగునీటి రంగంలో భాగంగా ఎస్ఎల్బీసీ ద్వారా 3 లక్షల ఎకరాలకుసాగునీరు అందించనున్నామని, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 3 లక్షల 61,000 ఎకరాలకు నీటిని అందిస్తున్నామని, అలాగే బ్రాహ్మణ వెల్లంలతో పాటు,ఉదయ సముద్రం, తదితర ప్రాజెక్టుల ద్వారా సైతం రైతులకు సాగునీటిని అందించనున్నట్లు వెల్లడించారు.రైతు భరోసా పథకం కింద 15 వేల రూపాయలు సబ్సిడీని అందించనున్నామని,ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు.నల్లగొండలో 5 ఎకరాల విస్తీర్ణంలో 20 కోట్ల రూపాయలతో నర్సింగ్ కళాశాల నిర్మాణాన్ని చేపట్టామని, ఇది ప్రారంభానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అలాగే 20 కోట్ల రూపాయల వ్యయంతో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాల అభివృద్ధి సంస్థ నిర్మాణాన్ని చేపట్టామని, పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.రహదారుల అభివృద్ధిలో భాగంగా నల్లగొండ జిల్లాలో 2024 25 సంవత్సరంలో 241.90 కిలో మీటర్ల రోడ్లు ,బ్రిడ్జిల మరమ్మతులకు 512 కోట్ల 81 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని, ఇవే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం కింద అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి వివిధ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. డీఆర్డిఏ ద్వారా బ్యాంకు లింకేజీ కింద 355.34 కోట్ల రూపాయల చెక్కును, శ్రీనిధి పథకం కింద 25 కోట్ల 22 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. పరిశ్రమల శాఖ ద్వారా వాణిజ్య వాహనాలకు 11 లక్షల రూపాయల చెక్కును, మెప్మా ద్వారా 768. 30 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు మంత్రి ప్రశంస పత్రాలను అందజేశారు.స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఏర్పాటుచేసిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.వివిధ శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా ఆయా శాఖలు శకటాలను రూపొందించగా, మొదటి ఉత్తమ శకటంగా వ్యవసాయ శాఖ, రెండవ ఉత్తమ శకటం గా డిఆర్డిఏ, మూడవ ఉత్తమ శకటం గా వైద్య ఆరోగ్యశాఖ, నాల్గవ ఉత్తమ శకటం గా అటవీశాఖలు గెలుచుకున్నాయి. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా శాఖలు వారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది.ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టుతో పాటు, రైతు రుణమాఫీ చివరి విడత నిధుల విడుదల కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి హాజరవుతున్న కార్యక్రమానికి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యే నిమిత్తం వెళ్ళగా ,అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి,తదితరులు ప్రభుత్వ స్టాల్స్ ను సందర్శించారు. అంతేకాక సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్సీలు నర్సిరెడ్డి, కోటిరెడ్డి ,మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు టీ. పూర్ణచంద్ర ,జె. శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ , ఆర్ డి ఓ రవి, జిల్లా అధికారులు హాజరయ్యారు.



### వరుస సెలవులు.. పెళ్లిళ్ల సీజన్‌తో

## కిటకిటలాడిన రైల్వే , బస్సు స్టేషన్ లు

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** వరుస సెలవులు రావడంతో పట్టణ ప్రజలు వారి స్వగ్రామాల దారి పట్టారు. సికింద్రాబాద్ జేబీఎస్ బస్ స్టేషన్ గురువారం ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడింది. స్వాతంత్ర దినోత్సవం, ఆగస్ట్ 16న వరలక్ష్మి వ్రతం, 17, 18 వీకెండ్ కావడంతో.. సిటీలో ఉద్యోగాలు చేస్తున్న పబ్లిక్ సొంతూళ్ల బాట పట్టారు. స్కూల్స్, కాలేజీలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు రావడంతో జేబీఎస్ నుంచి నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ జిల్లాలకు వెళ్లే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో కూడా దాదాపు ఇదే పరిస్థితి కనిపించింది. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులతో రైల్వే స్టేషన్ లో పండుగల సమయంలో కనిపించే దృశ్యాలు కనిపించాయి. ఎంజీబీఎస్ బస్టాండ్ లో కూడా ప్రయాణికులు ఫుల్ ఉన్నారు. విజయవాడ వైపు వెళ్లే బస్సుల్లో ఖాళీ లేని పరిస్థితి.

వరుస సెలవులతో పాటు పెళ్లిళ్ల సీజన్ కూడా కావడంతో పనిలోపనిగా అన్నీ చూసుకుని వచ్చేయొచ్చనే ఉద్దేశంతో హైదరాబాద్ నగరంలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న జనం సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే పబ్లిక్ బస్సులు, రైళ్లలో ముందే బుక్ చేసుకున్నారు. బుక్ చేసుకోకుండా నేరుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు, జేబీఎస్, ఎంజీబీఎస్ వెళుతున్న ప్రయాణికులు సీట్ల కోసం పాట్లు పడుతున్నారు. ఊళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్ ఏరియాల్లో గురువారం రద్దీ కనిపించింది. సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. సిటీ నుంచి ఏపీకి వెళ్లే వారితో ఎల్ బీనగర్ బస్టాప్ ఏరియాలో రద్దీ నెలకొంది. సిటీ నుంచి చాలామంది ఓన్ వెహికల్స్ లో సొంతూర్లకు బయలుదేరగా.. శివారు ప్రాంతాలతో పాటు బీబీనగర్ టోల్ ప్లాజా, పంతంగి టోల్ ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. హైదరాబాద్-విజయవాడ హైవేపై వెహికల్స్ చాలాసేపు ట్రాఫిక్ లో నిలిచిపోయాయి.

జరభద్రం

ఇక.. సెలవులకు సొంతూర్లకు వెళ్లే వారిని పోలీసులు అలర్ట్ చేశారు. డబ్బు, బంగారు నగలు సహా విలువైన వస్తువులను ఇండ్లలో పెట్టకూడదని హెచ్చరిస్తున్నారు.శివారు ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల్లో ఆటోలతో పోలీసులు ప్రచారం చేస్తున్నారు. ఊర్లకు వెళ్ళే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో, కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు తిరిగితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు. డబ్బు, బంగారం, వెండి బ్యాంక్ లాకర్స్‌లో భద్రపరచాలని, ఇంటి లోపల, బయట సీసీ కెమెరాలను ఆన్‌లోనే ఉంచాలని చెబుతున్నారు. నమ్మకమైన వారిని మాత్రమే వాచ్‌మన్‌గా పెట్టుకోవాలని, ఇంట్లో, బయట లైట్లు ఆన్‌లో ఉంచాలన్నారు. సొంతూరికి వెళ్తున్నట్లు సోషల్ మీడియా అకౌంట్లలో షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

# అన్నీ అబద్ధాలు.. బూతులే!

* సభ్యసమాజం తలదించుకునేలా సీఎం మాటలు
* ఆయనే ముక్కు నేలకు రాయాలి
* మండిపడిన బీఆరెస్ నేతలు

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి మాటల్లో అబద్ధాలు, అవాస్తవాలు, బూతులు తప్ప ఇంకోటి లేవని బీఆరెస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆక్షేపించారు. 29 రాష్ట్రాల్లోని ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా ప్రవర్తించడం లేదని ఆయన దుయ్యబట్టారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డిలతో కలిసి ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేలు కాదు, మూడు ఉద్యోగాలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని పల్లా ఆరోపించారు. ఎనిమిది నెలల్లో ప్రాజెక్టు సాధ్యం అయితే కొడంగల్‌నారాయణపేటలో తట్టెడుమట్టి కూడా ఎందుకు తీయలేదని ఆయన ప్రశ్నించారు. రుణమాఫీ మొత్తం చేశామని సీఎం పచ్చి అబద్ధం చెప్తున్నారని, దేశంలోనే అతి పెద్ద మోసమని పల్లా ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్లపై ఒట్టు వేసి దేవుళ్లను కూడా మోసం చేస్తున్నారని, హరీశ్‌రావు నిఖార్సయిన నాయకుడు, ఉద్యమకారుడని పల్లా తెలిపారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ, ఆరు గ్యారంటీలు సంపూర్ణంగా పూర్తి చేస్తే రాజీనామా చేస్తా అని హరీశ్‌రావు సవాల్ చేశారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి భాషను పశువులు కూడా సహించవని, ఆయనలో మృగం ఆవహించిందని అందరూ అనుకుంటున్నారని పేర్కొన్నారు

**పాలమూరు రంగారెడ్డి పనులు ఎందుకు చేయలేదు?**

సీతారామ ప్రాజెక్టు ఎనిమిది నెలల్లో పూర్తి చేసే సత్తా ఉంటే, పాలమూరు రంగారెడ్డి పనులు ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 47 లక్షల మందికి కావాల్సిన రుణమాఫీని కేవలం 22 లక్షల మందికి చేశారని, మిగతా రైతులకు చేయనందుకు అమరవీరుల స్థూపం వద్ద ఎవరు ముక్కు నేలకు రాయాలో ఆలోచించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. తమను ఎంత అవమానించినా తాము ప్రజల కోసం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

**సీఎం రేవంత్ భాష మార్చుకోవాలి**

పాలన చేతకాక ప్రతిపక్షాలను తిడుతూ కాలం గడుపుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి తన భాష మార్చుకోవాలని ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని, పట్టణాల్లో పరిస్థితి ఘోరంగా ఉందన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రజలు ఛీ కొడుతున్నారని ఆయన అన్నారు. హరీశ్‌రావును తిడితే తప్పులు ఒప్పులు కావని, కాంగ్రెస్ పార్టీని అన్నీ వైఫల్యాలే అని మండిపడ్డారు. సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పి అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

# డీఎస్సీ ఫలితాలు విడుదల 23న ?


**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణ డీఎస్సీ ఫలితాలను వీలైనంత తొందరగా విడుదల చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అందుకోసం డెడ్ లైన్ పెట్టుకుని కార్యాచరణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. తాజాగా టీజీ డీఎస్సీ ప్రిలిమినరీ ఆన్సర్ కీ విడుదలైన విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను కూడా తెలియజేయవచ్చు. అయితే.. తెలంగాణ డీఎస్సీ ఫలితాలు త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఆలస్యం కాకుండా పరీక్షలు పూర్తి అయిన కొద్దిరోజుల్లోనే ప్రాథమిక కీతో పాటు రెస్పాన్స్ షీట్లను విద్యాశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆగస్టు 20వ తేదీతో అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కూడా పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఫలితాలను కూడా ప్రకటించే యోచనలో విద్యాశాఖ ఉన్నట్లు అర్థమవుతోంది. తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి.. వెను వెంటనే షెడ్యూల్ ప్రకటించటంతో పాటు పరీక్షలను కూడా పూర్తి చేసింది. సాధ్యమైనంత త్వరగా కొత్త టీచర్ల సేవలను వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో సర్కార్ ఉంది. ఈ విషయంలో ఓ డెడ్ లైన్ కూడా పెట్టుకుని పని చేస్తోంది. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరణ పూర్తి కాగానే.. ఆ తర్వాత తుది కీని ప్రకటించనుంది. అనంతరం జనరల్ ర్యాకింగ్ లిస్టు అందుబాటులోకి తీసుకురానుంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత.. నియామక పత్రాలను అందజేయనుంది. దాదాపు తుది జాబితా ప్రక్రియ అంతా కూడా ఈనెలాఖరులోనే పూర్తి చేయాలని విద్యాశాఖ భావిస్తున్నట్లు సమాచారం. దీని ప్రకారం చూస్తే.. ఆగస్టు మూడో వారంలో ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది.



## ఆదర్శ పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలు

**విశ్వంభర, చివ్వేంల :** 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చివ్వేంల మండలం ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వేడుకలో పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఉపన్యాసం, ఆటలు, పాటలు మొదలైన పోటీలలో పాల్గొని ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు పాల్గొని ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి శంకర్ నాయక్ మాట్లాడుతూ భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందని, టెక్నాలజీ రంగంలో దేశం స్వావలంబన సాధించిందని అయినప్పటికీ కూడా పేదరికము, దారిద్యము భారతదేశంలో ఉన్నాయని, 78 సంవత్సరాలు పూర్తయినప్పటికీ భారతదేశంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వాటిని రేపటితరమైన విద్యార్థులు పరిష్కరించుకోవాలని సూచించారు. స్వాతంత్ర సమరయోధులు సూచించిన మార్గంలో వెళ్లాలని, భారతదేశం యొక్క విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలని, అన్ని రంగాల్లో భారతదేశం అగ్రగామిగా ఉండాలని, స్వతంత్ర సమరయోధులు కన్న కలలని నిజం చేయాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు.

## రామన్నపేట అభివృద్ధే లక్ష్యం



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో రామన్నపేట మండలానికి చెందిన వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వాతంత్ర్య దినోత్సవం గురించి రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ రామన్నపేట మండల అభివృద్ధే లక్ష్యంగా స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం సహకారంతో పని చేస్తామని అన్నారు. మండల కేంద్రానికి పరిశ్రమలు తీసుకు రావడం వలన నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని, మండలంలోని ప్రభుత్వ స్థలాలలో నూతన వాణిజ్య దుకాణ సముదాయాలు ఏర్పాటు చేస్తే స్థానిక వ్యాపారస్తులకు ఉపాధి దొరుకుతుందన్నారు. మండలానికి 200 వాణిజ్య దుకాణ సముదాయాలు అదనంగా ఏర్పడితే మండలం యొక్క వ్యాపారం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.



78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌కు చెందిన సీఐ నాగరాజుకు ఉత్తమ అవార్డును అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ కే నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.
- విశ్వంభర, వికారాబాద్

## గౌతంనగర్‌లో ఘనంగా జెండా పండుగ



**విశ్వంభర,మేడ్చల్ :** గౌతమ్ నగర్ కాలనీలో అంగరంగ వైభవంగా తిరంగా జెండా వేడుకలను బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మ కళ్యాణ్ ,13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపోలు రాములు హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనాటి భావితరాల భవిష్యత్తుకై ఆనాడు వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రాణాలను అర్పించి స్వతంత్రం తెచ్చిన మహనీయులకు పాదాభివందనం తెలిపారు. వారు చేసిన త్యాగాలు నేటికీ చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కాలనీ అధ్యక్షులు బొక్కి దుర్గయ్య, ఉపాధ్యక్షులు ఈ ముత్యాలు, ప్రధాన కార్యదర్శి ఎం డి గఫర్, ఉప కార్యదర్శి భూపతి సారయ్య ,కోశాధికారి వెంకటేష్, గౌతమ్ నగర్ కాలనీవాసులు,సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్ర



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితమే నేడు భారత స్వాతంత్ర్య దినోత్సవమని, బ్రిటీష్ పాలకుల నుంచి భరతమాతకు విముక్తి కలిగిన రోజని అన్నారు. నాటి నుంచి ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత మన దేశం అన్ని కీలక రంగాల్లో ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా అన్నారు.

## సివిల్ కాంట్రాక్టర్స్ ఆధ్వర్యంలో..



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బడితల వెంకటస్వామి పాల్గొన్ని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ యొక్క కార్యక్రమంలో సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, గంట దేవేందర్ రెడ్డి, జాడి తిరుపతి, బట్టు శ్రీనివాస్, పెరుమళ్ళ చంద్రమౌళి, నాగవెల్లి రాజలింగమూర్తి, కుంభం శ్రీనివాస్ రెడ్డి, గోగుల శ్రీనివాస్ రెడ్డి, సాంబశివరావ, సీనియర్ కాంట్రాక్ట్ సభ్యులు, జోగుల సమ్మయ్య, కొత్తగట్టయ్య, ఓ. కుమారస్వామి, తాటి అశోక్, కెక్కర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో జెండా ఆవిష్కరణ



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ మల్లయ్య జాతీయ జెండా ఎగురవేశారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 78 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి.**

**- విశ్వంభర, కామారెడ్డి**



## పీర్జాదిగూడ మున్సిపాలిటీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా పండుగ

- **ఎంతో మంది త్యాగాల ఫలితమే నేడు భారత స్వాతంత్ర్యం - బీఆర్ఎస్ నాయకులు జక్క వెంకట్ రెడ్డి**

**విశ్వంభర: మేడిపల్లి ;** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పార్టీశ్రేణుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్క వెంకట్ రెడ్డి హాజరై,జెండాను ఆవిష్కరించి,జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మేడిపల్లి కమలానగర్ మండలi పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎందరో మహానుభావులు,పరాయి దేశపు పాలనలో బానిస సంకెళ్ల నుంచి విముక్తి కొరకై,వీరోచితమైన పోరాటాలతో సాధించిన స్వాతంత్ర్యానికి 78 సంవత్సరాలు...స్వేచ్ఛను ప్రసాదించిన అనేక మంది స్వాతంత్రసమరయోధుల త్యాగం చిరస్మరణీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మనోరంజన్ రెడ్డి,జావేద్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు నిర్మల,యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఆంజనేయులు,బాలరాజు,గడీల జగన్ రెడ్డి, జోగిరెడ్డి,మల్లం వెంకటేష్ గౌడ్, శ్యామల సాయిలు, నరసింహ,శంకర్ రావు,పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.




## పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జెండా పండుగ



**విశ్వంభర,చండూరు:** 78వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని, చండూరు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గుర్రం బిక్షమయ్య జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో జరిగే సమావేశంలో పాల్గొన్న వక్తలు, ప్రముఖులు ఈ యొక్క స్వాతంత్ర దినోత్సవం ఎంతోమంది వీరుల త్యాగఫలం అని ఆ స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకునే భాధ్యత అందరి పై ఉందని అన్నారు. చేనేత రంగం సంక్షోభంలో ఉన్నందున చేనేత కార్మికుల కోసం అనేక నిరసనలు పోరాటాలు చేయాల్సి వస్తుందని అలాంటి కార్యక్రమంలో నేతన్నలందరూ పాల్గొని తమ ఐక్యమత్యాన్ని మరోసారి చూపించాల్సిన సమయం ఆసన్నమైనదని చెప్పారు. ఇటీవల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు గ్రహీత చిలుకూరి ధనుంజయను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చండూరు పట్టణ పద్మశాలి గౌరవ అధ్యక్షులు పులిపాటి ప్రసన్న , గౌరవ సలహాదారు కోడి గిరిబాబు, ట్రస్ట్ చైర్మన్ కోమటి వీరేశం ,ఉభయ దేవాలయాల చైర్మన్ రావిరాల నగేష్, చండూరు మున్సిపల్ కౌన్సిలర్ గుంటి వెంకటేశం, పట్టణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు పున్న ధర్మేంద్ర , ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్ , సహాయ కార్యదర్శి చెరిపల్లి అంజయ్య , కోశాధికారి చిలుకూరు రామ్మూర్తి , ప్రచార కార్యదర్శి చిట్టిప్రోలు వెంకటేష్ ,ప్రచార సహాయ కార్యదర్శి రాపోలు వెంకటేశం, గౌరవ కార్యవర్గ సభ్యులు పులిపాటి గోపయ్య , రావిరాల శ్రీను గారు, కర్నాటి శ్రీనివాసులు , ఏలే సుధాకర్, కోమటి ఓంకారం, ఆనందం వీరేశం, మార్కండేశ్వర యువజన సంఘం, అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## ఆర్మీ జవాన్లు, రైతులతో కలసి పొలాల్లో జెండా ఆవిష్కరణ

**విశ్వంభర, కోరుట్ల :** కోరుట్ల మున్సిపాలిటీ ఏకిన్ పూర్ గ్రామంలో వ్యవసాయ పొలం వద్ద రిటైడ్ ఆర్మీ జవాన్లు, రైతులు, కిసాన్ మోర్చా నాయకులతో కలిసి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జవాన్లు, రైతులను సన్మానించారు. కొడిపెల్లి గోపాల్ రెడ్డి ట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు స్వాతంత్ర దినోత్సవాన్ని రైతులు, ఆర్మీ జవాన్లతో పచ్చని పంట పొలాల్లో జరుపుకోవాడం చాలా సంతోషంగా ఉందని దేశ రక్షణ కొరకు సైనికులు, దేశంలో ఉన్న ప్రజల కొరకు రైతులు ఎంతగానో కష్టపడుతున్నారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సాంప్రదాయ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని ప్రజల ఆరోగ్యం కొరకు పురుగుమందులు లేని పంటలను పండించాలని సూచించారని తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్ కిషోర్ మాట్లాడుతూ రైతులు అనేక కష్టనష్టాలకు ఓర్చి దేశ ప్రజలందరికీ అన్నం పెడుతున్నారని సైనికులు అంకిత భావంతోనే దేశ రక్షణ చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ శేఖర్, రైతు నాయకులు నారాయణరెడ్డి రాజేందర్ రెడ్డి పల్లె రాజు మల్లేశం యాదయ్య శంకర్ ఏనుగు తిరుమల్ రెడ్డి సాయి రాజేందర్ రైతులు పాల్గొన్నారు.

## చేగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**చేగుంట ఆగస్టు 15(విశ్వంభర):** చేగుంట మండల కేంద్రంలో ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి జాతీయ పతాకాన్ని ఎంపీడీవో చిన్నారెడ్డి ఎగరవేశారు వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ భగత్ సింగ్ సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత మనపై ఉందని ఎందరో వీరుల త్యాగఫలం ఈ స్వాతంత్రం అని వారన్నారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్ మారుతి మండల నోడల్ అధికారి నీరజ ఏ పి ఓ శ్వేత విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు వచ్చిన వారందరికి స్వీట్లు పండ్లు పంచిపెట్టారు మరియు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



## పతాక ఆవిష్కరణ చేసిన డిపో మేనేజర్ తిరుపతి

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా భద్రాచలం డిపోలో డిపో మేనేజర్ తిరుపతి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం ఎందరో ప్రముఖులు అమరులయ్యారని వారి త్యాగ ఫలితమే ఈరోజు ఈ స్వాతంత్ర వేడుకని అన్నారు. భద్రాచలం డిపో అభివృద్ధికి ఉద్యోగులందరూ పాటుపడాలని, రాబోయే తరానికి కూడా మన ఆర్టీసీ ఫలాలు అందించాలని దానికోసం మనందరం కృషి చేద్దామని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి వారికి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను డిపో మేనేజర్ తిరుపతి అందించారు.



## వెల్డింగ్ వర్క్ షాప్స్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




విశ్వంభర కరీంనగర్: కరీంనగర్ టౌన్ వెల్డింగ్ వర్క్‌షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ప్రముఖులు, అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఓల్డేజ్ హోమ్‌లో స్వీట్లు అందజేశారు. వెల్డింగ్ వర్క్‌షాప్ ఓనర్స్ అసోసియేషన్ స్యభ్యులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు స్మరించుకొని నివాళులు అర్పించారు.

## చండూరులో ఘనంగా జెండా పండుగ



**విశ్వంభర, చండూరు :** 78 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చండూరు మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా ఫలాలు అని, వారి ప్రాణ త్యాగాలు వెల కట్టలేనిదని అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ , అన్నెపర్తి శేఖర్ , గుంటి వెంకటేశం, కొన్రెడ్డి యాదయ్య , అనంత మంగమ్మ గిరిధర్ , మంచుకొండ కీర్తి సంజయ్ , కో ఆప్షన్ సభ్యులు , రావిరాల నగేష్ , MD. ముజాయుద్దీన్ , సంకోజు దుర్గమ్మ, మున్సిపల్ అధికారులు వివిధ హోదాలో ఉన్న నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హన్మకొండ జయ కాలేజిలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం

**విశ్వంభర, హన్మకొండ :** స్వాతంత్ర్య సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ... ఈనాటి తరం వారి ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరం పునరంకితం కావాలని , దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని మన దేశ స్వాతంత్ర్య సౌభాత్రుత్వాన్ని కాపాడాలని శాంతికి ప్రతిరూపంగా నిలవటాలని క్రుషిచేయాలని పూజ్య బాపూజీ మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరు నిలవటాలని ప్రయత్నం చేయాలని ఏఐసిసి సభ్యులు సీనియర్ కాంగ్రేస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షిస్తూ...స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కూర వెంకట్, ఉపాధ్యక్షులు మార్క విజయ్ 8 వ డివిజన్ అధ్యక్షులు తక్కల్లపల్లి మనోహర్‌రావు , యండి ఇబ్రహీం పరిపాలనా కార్యదర్శి ,ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.



# అంబరాన్నంటిన స్వాతంత్ర్య సంబురాలు



మీర్‌పేట్ : టీకేఆర్ కళాశాలలో



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో..



నాంపల్లి : దామెర గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో..



బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జనరల్ సెక్రెటరీ మీసాల కృష్ణ, పార్టీ సభ్యులు



బోడుప్పల్ 13వ డివిజన్‌లో..



కుత్బుల్లాపూర్‌లో...



వనస్థలిపురం : ఆటో యూనియన్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో

**ఆగష్టు 15,1947 బ్రిటీష్ పాలకుల నుంచి భరతదేశానికి విముక్తి కలిగిన రోజు. ఎంతో మంది త్యాగాల ఫలితమో భారత స్వాతంత్ర్యం. 2024 ఆగష్టు 15న యావత్ భారతదేశం 78వ స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించింది. దేశం మొత్తం త్రివర్ణ పతాకాలు రెపరెపలాడుతాయి. వివిధ జాతులు, మతాలు, కులాలు కలిసి స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించుకున్న మన దేశం, ప్రపంచానికే ఆదర్శం. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం గౌరవ వందనం చేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులు, నాయకులు వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. వాడవాడలా మువ్వన్నెల జెండా ఎగురువేశారు.**



టీజేఎస్ పార్టీ కార్యాలయంలో..

**విశ్వంభర, హైదరాబాద్/వనస్థలిపురం/బడంగ్ పేట్/మీర్‌పెట్/సరూర్‌నగర్/కుత్బుల్లాపూర్/ఎల్బీనగర్/నిజాంపేట్/నాంపల్లి/బోడు-ప్పల్/కుత్బుల్లాపూర్**: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ జనసమితి (టీజేఎస్) చీఫ్ ప్రొ.కోదండరామ్ హైదరాబాద్ నాంపల్లిలోని టీజేఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం యొక్క విలువలను సమర్థిస్తూ మెరుగైన తెలంగాణ, భారతదేశం కోసం నిరంతరం కృషి చేద్దాం అని కోదండరామ్ అన్నారు.

**టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో**

హైదరాబాద్ జిల్లా గృహకల్ప ఆవరణలో టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం.హుస్సేని అధ్యక్షతన జాతీయ పతకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, కేంద్ర సంఘ క్రీడా కార్యదర్శి బోలిగిద్ద శంకర్, సభ్యులు వైదిక శాస్త్ర, ముఖిమ్ ఖురేషి, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

**బల్దియాలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మేయర్..**

బల్దియాలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి జాతీయ జెండాను ఎగురవేసి, వందనం సమర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్ రిజ్వానా శమీమ్ మసూద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**సుభాష్ చంద్రబోస్ అసోసియేషన్ యూత్ ఆధ్వర్యంలో..**

వనస్థలిపురం అనిల్ రెడ్డి సుభాష్ చంద్రబోస్ అసోసియేషన్ యూత్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ అధ్యక్షులు సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పోచంపల్లి గిరిధర్, తడకమల రవికుమార్, కళ్ళ బాలరాజు, ఎర్ర గిన్నెల సురేష్ బాబు, అనిల్ రెడ్డి సాయి నాసిక్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దాసు నాయక్, మాక్ట్యా నాయక్ సిద్దు నాయక్ చంద్రు నాయక్ ఫుల్ సింగ్ రాము బాపు బాలు నరేష్ లక్పతి చిన్న తదితరులు పాల్గొన్నారు.

**స్నేహ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో...**

వనస్థలిపురం వైదేహి నగర్‌లో స్నేహ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో అధ్యక్షుడు టి.సూర్యనారాయణ, ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్. శ్రీను, కోశాధికారి కే. సురేష్, ఆర్గనైజర్ దొరబాబు, కోర్ కమిటీ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వెంకన్న, మెంబర్స్ పాల్గొన్నారు.

**హయత్‌నగర్ నారాయణ ఉన్నత పాఠశాలలో**

నారాయణ ఉన్నత పాఠశాల LBN COS, Kalsa హయత్‌నగర్ పాఠశాలలో జీఎం గోపాల్‌రెడ్డి, డీన్ శ్రీ మదనాచారి, మార్కెటింగ్ ఏజీఎం సదాశివుడు, అకడమిక్ డీన్ సురేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్, నాగరాణి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శశిధర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, రామరాజు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో...**

కర్మాన్ ఘట్, హస్తినాపురం, నల్లకుంట, సుచిత్ర, ఘట్కేసర్ ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యమని అన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**టీకేఆర్ కళాశాలలో**

మీర్పేట్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకలలో కళాశాల సెక్రటరీ హరినాథ్ రెడ్డి, ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ హెచ్ ఓడీలు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.సీ.సీ విద్యార్థులు చేసిన విన్యాసాలు ఎంతగానో అలరించాయి.

**డాక్టర్స్ కాలనీలో...**

సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్, శ్రీ శివ సూర్యారామాలయం రోడ్ నెంబర్ 6 లో డాక్టర్ రాములు, రామమూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమములో వన్నడి శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి, వక్కలంక శ్రీనివాస్ రావు, ఉమామహేశ్వర రావు, శ్రీనివాస్, చంద్రయ్యా, నరేష్, కృష్ణ నగేష్, తిరుపతయ్య, మమత, సరిత, నిత్య, రాధికా, సంధ్య, రమ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీనిధి పాఠశాలలో...**

సరూర్‌నగర్ డివిజన్‌లోని శ్రీనిధి గ్లోబల్ పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అర్.కే పురం కార్పొరేటర్ రాధ ధీరజ్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు నల్లపాటి వెంకటేశ్వర రావు, నల్లపాటి రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సిద్దు ముదిరాజ్ పాల్గొన్నారు.

**వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

సరూర్ నగర్, వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యలో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. రోడ్డు నెంబర్ 3 లోని కమ్యూనిటీ హాల్లో కాలనీ ఇన్చార్జ్ ప్రెసిడెంటు మారోజు శ్రీనివాస్ రావు, రోడ్డు నెంబర్ 8లోని లైబ్రెరీ హాల్లో ప్రధాన కార్యదర్శి పీ.వీ.ఎస్ ప్రసాద్ లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సంధర్భంగా కాలనీ నివాసి రిటైర్డ్ మిలటరీ ఆఫీసర్ కణకారావు దంపతులను శాలువాతో సన్మానించారు.

**దుండిగల్ మున్సిపాలిటీలో..**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలోని పురపాలక కార్యాలయంలో జాతీయ జెండాను పురపాలక చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, ఎమ్మార్వో మతీన్, కౌన్సిలర్లు వనితా బుచ్చిరెడ్డి, నవితా శ్రీనివాస్ రెడ్డి, ఆర్.వో సునంద, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఓజోన్ హాస్పిటల్‌లో...**

ఎల్బీనగర్ ఆర్కే పురం ఓజోన్ హాస్పిటల్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ సర్జన్ డా. సుశాంత్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాఘవాదిత్య, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, సి ఓ ఓ డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావులు జాతీయ జెండాను ఎగురవేశారు.

**మాస్టర్ మైండ్ పాఠశాలలో..**

వనస్థలిపురం డివిజన్ భూలక్ష్మీనగర్‌లోని మాస్టర్ మైండ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ రమారెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో మాస్టర్ మైండ్ పాఠశాల టీచర్స్, విద్యార్థిని, విద్యార్థులు, తల్లితండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో..**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీ కోలన్ గోపాల్ రెడ్డి, యువ నాయకులు కోలన్ అభిషేక్ రెడ్డి, కోలన్ రిషికేష్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిట్ల దివాకర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**నాంపల్లి :**

**దామెర గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో...**

దామెర గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలగోని శ్రీను, కడారి పెద్దులు, పూదరి కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖరం, ఉపాధ్యాయులు ఇమామ్ ,యాదయ్య, రమణ, జ్యోతి, శ్రీహరి , మహేష్, శ్రవణ్ , ఉజ్వల, శిరీష, రవి గ్రామ పెద్దలు, పొలగోని శ్రీను, కడారి పెద్దులు, పూదరి కృష్ణ , విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బోడుప్పల్ 13వ డివిజన్‌లో..**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ దాన గళ్ళ అనిత యాదగిరి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల యాదగిరి, డివిజన్ అధ్యక్షులు గోపురాములు పద్మ, జనరల్ సెక్రెటరీ నానాజీ తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్‌లో...**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని జీడిమెట్ల డివిజన్ పరిధిలోని బీరప్పనగర్, ప్రసూన్ననగర్ కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో పంద్రాగస్టు వేడుకలకు ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సంక్షేమ సంఘం సభ్యులు సంతోష్, కోటేశ్వర రావు, వెంకటేష్, రాజు, బాల్ రెడ్డి, ప్రసన్న, గాయత్రి, సంధ్య, ప్రసూన్ననగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంచందర్, జనరల్ సెక్రెటరీ సిద్ధులు, సభ్యులు పాల్గొన్నారు.



బల్దియాలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మేయర్



టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో





స్నేహ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో...



హయత్‌నగర్ నారాయణ ఉన్నత పాఠశాలలో..



బడంగ్ పేట్ : ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో..



సరూర్‌నగర్ : డాక్టర్స్ కాలనీలో..



సరూర్‌నగర్ : శ్రీనిధి పాఠశాలలో..



సరూర్‌నగర్ : వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



కుత్బుల్లాపూర్ : దుండిగల్ మున్సిపాలిటీలో..



ఎల్బీనగర్ : ఓజోన్ హాస్పిటల్‌లో..



ఎల్బీనగర్ : మాస్టర్ మైండ్ పాఠశాలలో..

# రేవంత్ రెడ్డికి తెలంగాణ సోయి లేదు

- ఆయన వలసవాద పుత్రుడు
- తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్ విగ్రహం పెడతారా?
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని అనుకున్న చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతుండటం ముమ్మాటికి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేయడమేనని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. అధిష్ఠానం మెప్పు కోసమే సీఎం రేవంత్ రెడ్డి సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలనుకుంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ సోయి లేదని.. ఆయన వలసవాద పుత్రుడు అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దేవీప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

ఒకవైపు స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు చేకుంటుంటే, ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ స్వాభిమానం మీద దాడి చేస్తోందని దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ సోయి లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రైఫిల్ పట్టుకుని బయలుదేరాడని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జై తెలంగాణ నినాదం మసక బారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జై తెలంగాణ స్థానంలో జై సోనియా, జై కాంగ్రెస్ నినాదాలు తెచ్చారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ అధికార చిహ్నంలోని చార్మినార్, కాకతీయ తోరణాలను రాచరిక చిహ్నాలుగా హేళన చేశాడని అన్నారు. మరోసారి తెలంగాణ స్వాభిమానాన్ని దెబ్బతీసేందుకు తెలంగాణ సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌కు నివాళిగా తెలంగాణ సచివాలయానికి ఆయన పేరు పెట్టామని దేశపతి శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ ఏర్పడింది కనుక సచివాలయానికి ఆయన పేరు పెట్టామని వివరించారు. నిత్యం అమరుల స్ఫూర్తిగా పాలన జరగాలనే ఉద్దేశంతోనే సచివాలయం ఎదురుగా అమరజ్యోతి భవనం ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. సచివాలయం, అమరజ్యోతి మధ్య ఉండాల్సింది తెలంగాణ తల్లి విగ్రహమే అని వ్యాఖ్యానించారు. సచివాలయంలో



ఉండాల్సింది వ్యక్తుల విగ్రహం కాదు, తెలంగాణ తల్లి విగ్రహమని స్పష్టం చేశారు..

అధిష్ఠానం మెప్పు కోసం రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలనుకుంటున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై దేశపతి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని కోరుకుంటుంటే, రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం కావాలా, రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం కావాలా ప్రజలు తేల్చుకోవాలని తెలిపారు. కావాలంటే రాజీవ్ గాంధీ విగ్రహాలు బయట ఎన్నైనా పెట్టుకోవచ్చుని.. సచివాలయం ఎదుట మాత్రం పెట్టకూడదని స్పష్టం చేశారు.

అసలు రాజీవ్ గాంధీకి తెలంగాణతో ఏం సంబంధం? సోనియాకైనా తెలంగాణతో సంబంధం ఉందని అన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టే ముందు తెలంగాణ మేధావులతో ఏమైనా చర్చలు జరిపారా అని నిలదీశారు. కనీసం కోదండరాం, హరగోపాల్, అందెశ్రీల అభిప్రాయాలను తెలుసుకోండని హితవు పలికారు. . వారు ముగ్గురు కూడా రాజీవ్ గాంధీ విగ్రహం అక్కడ వద్దని రేవంత్‌కు చెబితే మంచిదని అన్నారు. ఇప్పటికైనా రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని సూచించారు.

రాజీవ్ విగ్రహం పెట్టాలని మొండికేస్తే తెలంగాణలో అలజడి మొదలవుతుందని.. మేము కార్యాచరణ ప్రకటించాల్సి ఉంటుందని దేశపతి శ్రీనివాస్ హెచ్చరించారు. తెలంగాణ అస్తిత్వం మీద దాడి చేయడం మానాలని సూచించారు. గతంలో కాంగ్రెస్ తీరు వల్లే ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయని చెప్పారు. మళ్లీ తెలంగాణ అస్తిత్వంపై ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అదే దాడిని కొనసాగిస్తోందని మండిపడ్డారు. గతంలో ఏపీ సచివాలయం ముందు తెలుగు తల్లి విగ్రహం ఉండేదని.. కనీసం ఆ స్ఫూర్తితోనైనా తెలంగాణ సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని సూచించారు.



## యాదగిరిగుట్టలో వైభవంగా వార్షిక పవిత్రోత్సవాలు

**విశ్వంభర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో మహా వైభవంగా ప్రారంభమైన వార్షిక పవిత్రోత్సవములలో భాగంగా గురువారం ఉదయం స్వామి వారికి నవకలశ స్నాపనం జరిగింది. యజ్ఞశాలలో ద్వార తోరణ పూజ, కుంభారాధన, చక్రబ్జమండలారాధన నిర్వహించి ప్రత్యేక హోమాలు జరిపారు. నిత్య లఘు పూర్ణాహుతి జరిగాక గర్భాలయములో మూల స్వామి వారికందరికి లఘు పవిత్ర ధారణ నిర్వహించారు. అనంతరం మహా నివేదన తీర్థ ప్రసాద వితరణ గావించారు.కాగా, లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఇవాళ్టి నుంచి వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఏడాది కాలం నుంచి ఆస్థాన పరంగా, భక్తుల మొక్కు పూజల నిర్వహణలో తెలిసీ, తెలియకుండా జరిగే పొరపాట్ల (దోషాలు) నివారణ నిమిత్తం ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముస్లిం స్టూడెంట్ ఆర్గనైజేషన్ పండ్ల పంపిణీ



**విశ్వంభర, కరీంనగర్:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ముస్లిం స్టూడెంట్ ఆర్గనైజేషన్ గురువారం జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రిలో దాదాపు రెండు వందల మంది రోగులకు పండ్ల పాకెట్లను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా కరీంనగర్ ప్రెసిడెంట్ ముస్లిం స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, ఎంఎస్‌ఓ డాక్టర్ సాదియా నాజ్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి వృద్ధాశ్రమం, అనాథాశ్రమం, మానసిక వికలాంగుల ఆశ్రమాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షాకాలం గొడుగులు, శీతాకాలపు దుప్పట్ల పంపిణీ వంటి పేద ప్రజలకు సహాయం చేస్తున్నామన్నారు. అనేక అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు, డాక్టర్ సాదియా నాజ్, ఫర్హీన్ సుల్తానా, సోఫియా నాజ్, సాజిదా, అయేషా అఫ్నాన్, అక్సా ముస్కాన్, సానియా సాల్వా, సనా ఇతర సభ్యులు పండ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాజీ ఎమ్మెల్యేల ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, ఖమ్మం:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం ఏన్కూరు లింక్ కెనాల్ నుంచి వైరా రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తారు. దీంతో గోదావరి జలాలు మరికొద్ది గంటల్లోనే తొలిసారిగా ఖమ్మం జిల్లాకు చేరనున్నాయి. పంప్ హౌజ్ ప్రారంభోత్సవం తర్వాత వైరా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. ఆ సభలోనే రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి నిధులు విడుదల చేస్తారు. ఈ క్రమంలో సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు పకడ్బందీగా బందోబస్తు చేపట్టారు. సీతారామ ప్రాజెక్టుల ద్వారా భద్రాద్రి జిల్లాకు కూడా నీళ్లు ఇవ్వాలంటూ నిరసన చేపట్టిన మాజీ ఎమ్మెల్యేలు రేగ కాంతారావు, బానోత్ హరిప్రియను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఇక వైరా మండల కేంద్రంలో పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## నిజాయితీ చాటుకున్న యువకునికి సన్మానం

**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో రోడ్డుపై వెళ్తున్నయువకుడు అమీర్ కి రూ. 30,000/ నగదుతో ఓ బ్యాగు దొరికితే నిజాయితీతో ఆ బ్యాగు పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అప్పగించిన అమీర్ కు స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మహాదేవపూర్ మండల కేంద్రంలోని శ్రీ స్వరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శాలువాతో సన్మానించి, ఓ బ్యాగును బహుమతిగా అందజేయడం జరిగింది. ఇలా అందరు విద్యార్థులు తమది కాని వస్తువులను తిరిగి వారికి అప్పగించాలని తెలియజేశారు. ఈ కార్యమంలో సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర అదనపు అకాడామిక్ ఇన్చార్జి పూరే సాంబశివరావు, పాఠశాల కరస్పాండెంట్ జనమోహణాచారి పాల్గొన్నారు.



## ప్రజా పాలనతో అందరికీ సంక్షేమ ఫలాలు



- ప్రజా పాలనకు స్పందన భేష్
- జీహెచ్ఎంసీ పంద్రాగస్టు వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**విశ్వంభర, హైదరాబాద్:** కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలనకు అన్ని వర్గాల నుంచి మంచి స్పందన వస్తుందని, రైతుల పక్షపాతిగా దేశంలోనే మొట్టమొదటి సర్కారు రేవంత్ సర్కార్ అంటూ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వ్యాఖ్యానించారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మేయర్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఎప్పటికపుడు అందుబాటులోకి వస్తున్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ నగరవాసులకు మెరుగైన పౌరసేవల నిర్వహణ చేపడుతుందన్నారు. భవిష్యత్తు తరాలకు అవసరమైన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్తున్నామంటూ ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజా పాలన దిశగా అడుగులు వేస్తుందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఇటీవలే ఉద్యోగుల ఆశలు నెరవేర్చేలా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీని ఆర్థికంగా ఆదుకోవడానికి పాలన చేపట్టిన నెల రోజుల్లోనే రూ.1100 కోట్ల రూపాయల నిధులను కేటాయించి అండగా నిలిచిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర బడ్జెట్ లో బల్దియాకు రూ.3,065 కోట్లను కేటాయించటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రత్యేకంగా హైడ్రాను ఏర్పాటు చేసిన సర్కారు వివిధ విభాగాలకు ఒక్క గ్రేటర్ హైదరాబాద్ లోనే రూ. 20 వేల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ్ అగర్వాల్, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరిష్, కే శ్రీనివాసరావు, శివకుమార్ నాయుడు, యాదగిరి రావు, సత్యనారాయణ, నళిని పద్మావతి, గీతా రాధిక, సరోజ, పంకజ, మంగతాయారు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ దేవానంద్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ కే.ఎస్ రెడ్డి, సీపీఆర్వో ముర్తుజా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో స్టేషన్ ఘన్‌పూర్ ఉపఎన్నిక

- రాజయ్య గెలుపు ఖాయం
- హైకోర్టులో తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశిస్తున్నా
- సభాపతి రాజకీయ పక్షపాతం చూపిస్తున్నారు..
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** పార్టీకి ద్రోహం చేసిన వారికి నాలుగేళ్ల తర్వాత ప్రజలు బుద్ధి చెబుతారని, త్వరలోస్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నిక వస్తుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి రాజయ్య గెలుపు ఖాయమన్నారు. హైకోర్టులో తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశిస్తున్నామని. మిగతా వాళ్లపై నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు. సభాపతి రాజకీయ పక్షపాతం చూపిస్తూ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీ మారుపాక రవి, మాజీ ఎంపీపీ బుచ్చయ్య, ఇతర నేతలు తిరిగి భారాసలో చేరారు. కండువా కప్పి కేటీఆర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు పోతే వార్త.. రేవంత్ వచ్చాక కరెంట్ ఉంటే వార్త. రుణమాఫీ సభకు రావాలని రాహుల్ గాంధీని ఆహ్వానించారు. రుణమాఫీ కాలేదని తెలుసు కొని రాహుల్ గాంధీ రాలేదు. కల్యాణ లక్ష్మి కింద ఇవ్వడానికి బంగారం దుకాణాలు దొరకలేదా? ఆడ పిల్లలకు రేవంత్రెడ్డి 2.5లక్షల తులాల బంగారం బాకీ ఉన్నారు. రేవంత్‌రెడ్డి సోదరులను ఏ ప్రజలు గెలిపించారు? రేవంత్ బామ్మర్ది కంపెనీకి రూ.వెయ్యి కోట్ల పనులు ఇచ్చారు.

కవిత జైలులో ఉంటే అన్నగా నేను ఢిల్లీ పోయి కలవొద్దా? కవిత కేసు విషయంపై న్యాయవాదులతో మాట్లాడవద్దా? బీజేపీతో ఒప్పందం ఉంటే కవిత 150 రోజులుగా జైల్లో ఉంటుందా? ఒక్క కాంగ్రెస్ నేత అయినా జైల్లో ఉన్నారా? త్వరలో కేసీఆర్ పార్టీ కార్యక్రమాలు ఇస్తారు. కొద్ది రోజుల్లోనే కేసీఆర్ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తారు. కేసీఆర్ పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్టుకు రేవంత్ వెళ్లి రిబ్బన్ కట్ చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లని బీసీ డిక్లరేషన్లో చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు పెడతారు. బీజేపీ నేతలు.. కాంగ్రెస్, రేవంత్ చెప్పినట్టే నడుచుకుంటున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరగలేని పరిస్థితి వస్తుంది" అని కేటీఆర్ అన్నారు.

## స్వాతంత్ర్య వేడుకులకు ముఖ్య అతిథిగా పొదెం వీరయ్య

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య జిల్లా కేంద్రంలోని డా బీ ఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జిల్లా జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటీష్ పాలన నుండి మన దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించేందుకు జరిగిన సంగ్రామంలో ప్రాణాలను తృణపాయం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం ప్రగతి వైపు పయనం సాగిస్తున్నదని, సంపద సృష్టించడం, సృష్టించిన సంపదను ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వినియోగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి పొదెం వీరయ్య వివరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సత్కరించారు. వివిధ పాఠశాల విద్యార్థులు దేశభక్తిని పెంపొందించే విధంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. చక్కని ప్రదర్శన గావించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. వివిద ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రసంసా పత్రాలను అందజేశారు. అలాగే శాఖల ద్వారా ఎంపిక చేసిన లబ్దిదారులకు అసెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రాజ్‌భవన్‌లో "ఎట్‌హోం" కార్యక్రమం

**విశ్వంభర, హైదరాబాద్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాజ్ భవన్‌లో "ఎట్ హోం" కార్యక్రమం ఉత్సాహ భరితంగా జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏర్పాటు చేసిన తేనీటి విందుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అలాగే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. బీజేపీ నేతలు మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాజ్‌భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు, విద్యార్థులు హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో రాహుల్ సీటుపై చర్చ..

**ఢిల్లీ:** ఎర్రకోటలో 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ వేడుకలకు హాజరయ్యారు. అధికారికంగా నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ప్రతిపక్ష నేత హాజరుకావడం దశాబ్దకాలం తర్వాత ఇదే తొలిసారి. ఇదిలాఉండగా రాహుల్ గాంధీ ఒలింపిక్ పతక విజేతలతో కలిసి కూర్చున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. అయితే, ఈ వేడుకల్లో ప్రతిపక్ష నేతకు కేటాయించిన సీటుపై సర్వత్రా చర్చ జరుగుతోంది.ప్రోటోకాల్ ప్రకారం లోక్ సభలో ప్రతిపక్ష నేత, క్యాబినెట్ మంత్రులకు సమానంగా ముందు వరుసలో సీట్లు కేటాయిస్తారు. కానీ, రాహుల్ గాంధీకి చివరి వరుసలో సీటు కేటాయించడంపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించింది. అంతకుముందు రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## 20 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంకల్ప్ విద్యాపీఠం పాఠశాలలో గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సుమారు 20 మీటర్ల జాతీయ జెండాను సంకల్ప్ విద్యాపీఠం పాఠశాల నుండి అయ్యప్ప స్వామి దేవాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం మీదుగా మెయిన్ రోడ్డు గుండా ఎమ్మార్పీ చౌరస్తా నుండి ర్యాలీగా పాఠశాల వరకు బయలుదేరారు. ఈ ర్యాలీలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు కృష్ణ, మూర్తి, బంద్ అయ్యా, శశి కుమార్, నర్సింలు, మల్లికార్జున్, వాసవి, నవీన, సలోమి, సంగీత, భ్రమరాంబ, మికిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అప్సర ఐస్ క్రీమ్స్ ఆధ్వర్యంలో ముస్కాన్ కార్యక్రమం

విశ్వంభర, బషీర్ బాగ్: ప్రజల ముఖాల్లో ఆనందం, చిరునవ్వులు నింపే ప్రయత్నంలో భాగంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవంతో మిళితమయ్యేలా 53వ వార్షికోత్సవం సందర్భంగా ముస్కాన్ పేరుతో ఒక విశిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించినట్లుగా అప్సర ఐస్ క్రీమ్స్ ప్రకటించింది. ఐదు దశాబ్దాలకు పైగా మార్కెట్ లో ఉనికిని కలిగిన విశ్వసనీయ బ్రాండ్ అయిన అప్సర ఐస్ క్రీమ్స్, ప్రారంభం నుండి కూడా తన వినియోగదారులకు నాణ్యమైన ప్రీమియం ఐస్ క్రీమ్లను అందిస్తోంది. తన 53వ వార్షికోత్సవంలో భాగంగా భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని వేడుక చేసుకోవడానికి అప్సర ఐస్ క్రీమ్స్ ఒక ప్రత్యేక కార్యక్ర మాన్ని ప్రారంభించనుంది. ఇది నిజంగా భారతీయులందరికీ గర్వకారణం. ఈ కార్యక్రమం ఆగస్టు 15న ముంబై, పుణేలలో ప్రారంభమవుతుంది. ఆ తరువాత దశలవారీగా ఇతర నగరాల్లో అమలు కానుంది. ముస్కాన్ కార్యక్రమం కింద కంపెనీ 53,000 ఐస్ క్రీమ్ లు (దాదాపు నాలుగు టన్నుల ఐస్క్రీమ్) పంపిణీ చేయాలని భావిస్తోంది. ఈ కార్యక్రమం భారతదేశంలోని 9 రాష్ట్రాలు, 25 నగరాలలో అమలు కానుంది.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంది

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**విశ్వంభర, వికారాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమాని సభపతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి గురించి శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ వివరించారు. మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాలకు 18.75 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు, గ్రామీణ మహిళా సంఘాలకు 52 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను స్పీకర్ అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో (10/10) ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు 1000 రూపాయల నగదు పారితోషికాన్ని స్పీకర్ అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ పత్రాలను, ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బందికి స్పీకర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన బాల బాలికలకు స్పీకర్ చేతుల మీదుగా మెమొంటోలను అందజేశారు. కలెక్టరేట్ ఆవరణలో వివిధ శాఖలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాల్లను సభాపతి, జిల్లా కలెక్టర్ లు, అదనపు కలెక్టర్, ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, పరిగి, తాండూర్ శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# ఇక రైళ్లలో కొత్తరకం దుప్పట్లు

**ఢిల్లీ:** మరింత సౌకర్యవంతంగా ఉండేలా అత్యంత మృదువైన దుప్పట్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఎక్కువకాలం మన్నడంతోపాటు ప్రయాణికులు వీటిని కప్పుకొంటే మెరుగ్గా శ్వాస తీసుకునే వీలుంటుంది. భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్)తో కలిసి విస్తృత పరిశోధన చేసి, ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లతో సంప్రదించి వీటిని రూపొందించారు. ఆతిథ్య పరిశ్రమతో సమానంగా తాజా అనుభూతి కలిగేలా చూడడం ఈ ప్రయత్నం ఉద్దేశమని ఉత్తర రైల్వే తెలిపింది. బుధవారం రాంచీ రాజధాని ఎక్స్ప్రెస్లో వీటిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ప్రయాణికుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత మిగిలిన రైళ్లకు అందుబాటులోకి తెస్తారు.

# ఉత్కంఠగా ప్రోకబడ్డీ లీగ్ వేలం..

## ఖరీదైన ఆటగాడిగా సచిన్ తోమర్



**విశ్వంభర, స్పోర్ట్స్:** కబడ్డీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసిన ప్రోకబడ్డీ 10వ సీజన్ వేలం మొదలైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ వేలంలో స్టార్ ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరిస్తున్నాయి. ముంబైలో గురువారం వేలం మొదలైందో లేదో డిఫెండర్ల కోసం ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. ఇప్పటివరకూ సచిన్ తోమర్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. దాంతో, ఇరాన్ డిఫెండర్ మహ్మద్ రెజా షాద్‌లోహ్ రెండోస్థానానికి పడిపోయాడు.సచిన్ తోమర్‌ను తమిల్ తలైవాస్ ఏకంగా రూ.2.15 కోట్లకు కొన్నది. ఇక ఇరానీ డిఫెండర్ మహమ్మద్ రెజా షాద్‌లోహిని రూ.2.07 కోట్లకు హర్యానా స్టీలర్స్ సొంతం చేసుకుంది. ఆల్‌రౌండర్ పవన్ షెహ్రావత్‌ను తెలుగు టైటాన్స్ కొన్నది. బెంగళూరు బుల్స్ గట్టి పోటీ ఇచ్చినా చివరకు టైటాన్స్ అతడిని రూ.1.72 కోట్లకు దక్కించుకుంది.భారత్‌కు చెందిన డిఫెండర్ సునీల్ కుమార్ కోసం యూ ముంబా ఏకంగా రూ.1.015 కోట్లు పెట్టింది. వేలంలో భారీ ధర పలుకుతాడని ఊహించిన ఇరాన్ డిఫెండర్ ఫజల్ అత్రాచలికి నిరాశ తప్పలేదు. పీకేఎల్‌లో గొప్ప రికార్డు ఉన్న అతడిని కేవలం రూ.50 లక్షలకే బెంగాల్ వారియర్స్ హస్తగతం చేసుకుంది.

**ఏ జట్టు ఎవరిని కొన్నదంటే..**

1. సచిన్ తోమర్ – రూ.2.15 కోట్లు – తమిల్ తలైవాస్
2. మహ్మద్‌రెజా షాద్‌లోహ్ – రూ.2.07 కోట్లు – హర్యానీ స్టీలర్స్
3. పవన్ షెహ్రావత్ – రూ.1.75 కోట్లు – తెలుగు టైటాన్స్
4. మణిందర్ సింగ్ – రూ.1.15 కోట్లు – బెంగళూరు బుల్స్
5. సునీల్ కుమార్ – రూ.1.015 కోట్లు – యూ ముంబా
6. కిషన్ – రూ. 70 లక్షలు – తెలుగు టైటాన్స్
7. ఫజల్ అత్రచెలీ – రూ.50 లక్షలు – బెంగాల్ వారియర్స్.

# అథ్లెట్లకు బీసీసీఐ గుడ్‌న్యూస్..

## జాతీయ క్రికెట్ అకాడమీలో అథ్లెట్లకు ప్రాక్టీస్ చేసుకునే అవకాశమిస్తామన్న జైషా

**విశ్వంభర, స్పోర్ట్స్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి అథ్లెట్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. బెంగళూరులో క్రికెటర్ల కోసం కొత్తగా నిర్మించిన జాతీయ క్రికెట్ అకాడమీలో అథ్లెట్లకు ప్రాక్టీస్ చేసుకునే అవకాశమిస్తామని చెప్పింది. బెంగళూరులో భారత క్రికెటర్ల కోసం కొత్తగా నిర్మించిన త్వరలోనే ప్రారంభం కానుంది. ఆధునిక వసతులతో రూపొందించిన ఈ అకాడమీలో యువక్రికెటర్ల పాలిట వరంగా మారనుంది. అంతర్జాతీయ హంగులతో కూడిన ఈ అకాడమీ గురించి గురువారం బీసీసీఐ సెక్రటరీ జై షా కీలక వ్యాఖ్యలు చేశాడు.ఎన్‌సీఏ అనేది క్రికెటర్ల కోసమే కాదని, అథ్లెట్లకు కూడా ఉపయోగపడనుందని చెప్పాడు. 'ఎన్‌సీఏను క్రికెటర్లకే కాకుండా ఒలింపిక్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రా(Neeraj Chopra)కు కూడా అందుబాటులో ఉంచుతాం. ఒలింపిక్స్ సన్నద్ధతలో ఉన్న ఇతర అథ్లెట్లు కూడా క్రికెట్ అకాడమీని ఉపయోగించుకోవచ్చు' అని షా తెలిపాడు.

నీరజ్ చోప్రా: ఈ మధ్యే షా కొత్తగా కట్టిన ఎన్‌సీఏలోని వసతుల గురించి ఓ పోస్ట్ పెట్టాడు. 'కొత్త జాతీయ క్రికెట్ అకాడమీ ఏర్పాటు ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందనే విషయాన్ని మీతో పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే బెంగళూరులో ఈ అకాడమీని ప్రారంభించనున్నాం. ఈ కొత్త ఎన్‌సీఏలో మూడు ప్రపంచ స్థాయి మైదానాలు, 45 ప్రాక్టిస్ పిచ్‌లు, ఇండోర్ క్రికెట్ పిచ్‌లు, ఒలింపిక్ పోటీల్లో ఉపయోగించేంతటి పెద్ద పరిమాణంలోని ఈత కొలను ఉన్నాయి. ఇవే కాకుండా ఆర్ట్ ట్రైనింగ్, ఆటగాళ్ల చికిత్స, స్పోర్ట్స్ సైన్స్‌కు సంబంధించిన సకల వసతులు ఉన్నాయి. భారత క్రికెటర్లు, భావి ఆటగాళ్లు ఒక సకల సౌకర్యాలతో కూడిన వాతావరణంలో నైపుణ్యాలు పెంపొందించేందుకు మా ఈ ప్రయత్నం ఉపకరిస్తుందని మేము భావిస్తున్నా' అని షా వెల్లడించాడు.



# బ్యాక్ డోర్ పాలిటిక్స్ పని చేయవు..



## పేరెత్తకుండానే కేంద్రంపై సిద్దరామయ్య విసుర్లు!

**విశ్వంభర, బెంగళూరు:** కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య గురువారం సంచలన వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి కోసం రాష్ట్రాలకు సరైన వాటా నిధులు విడుదల చేయాలని కోరారు. నిధుల కేటాయింపులో వివక్ష చూపొద్దని కోరారు. ప్రజాతీర్పును అపహస్యం చేసేలా తెర వెనుక రాజకీయాలు చేసే వారిని ప్రజలు మరిచిపోరని పేరు చెప్పకుండానే బీజేపీని విమర్శించారు. విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ సూత్రాలకు లోబడి పాలన సాగించాలని భావిస్తాయన్నారు. రాజ్యాంగం ప్రకారం సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలు బాధ్యత రాష్ట్రాలది కాగా, వాటికి అవసరమైన నిధులు సమకూరుస్తూ కేంద్రం మద్దతు ఇవ్వాలన్నారు. కానీ కేంద్రం ఈ సూత్రం అమలు చేయకుండా దూరమవుతోందన్నారు.రాజ్యాంగ సూత్రాలను నిర్లక్ష్యం చేస్తూ రాష్ట్రాలకు నిధుల విడుదలలో జాప్యం చేసే ధోరణి పెరిగి పోయిందని సిద్దరామయ్య పేర్కొన్నారు. ఈ ధోరణి వల్ల రాష్ట్రాలు తమ న్యాయమైన వాటా కోసం న్యాయ పోరాటానికి దిగాల్సి వస్తుందన్నారు. విపక్షాల పాలిత రాష్ట్రాలకు నిధుల విడుదలలో వివక్షను నిరసిస్తూ.. కర్ణాటక సీఎం సిద్దరామయ్య, కేరళ సీఎం పినరయి విజయన్ లతోపాటు ఆ రెండు రాష్ట్రాల మంత్రులు గత ఫిబ్రవరిలో ఢిల్లీలో నిరసన తెలిపారు. తమ హక్కుల పరిరక్షణ కోసం కేరళ సుప్రీంకోర్టు తలుపు తట్టింది.

# కోల్‌కతా ఘటనలో సత్వర న్యాయం జరగాలి

## టీఎంసీ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి



**కోల్ కతా:** కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెనుదుమారం రేపుతున్నది. ఈ ఘటనకు వ్యతిరేకంగా మహిళలు చేపట్టిన నిరసన ప్రదర్శనలో టీఎంసీ మాజీ ఎంపీ, నటి మిమీ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిమీ చక్రవర్తి మాట్లాడుతూ ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, ఈ వ్యవహారంలో సత్వర న్యాయం కావాలని మహిళలు, సోదరులు కోరుతున్నారని చెప్పారు.కోల్‌కతా ఇలాంటి నేరాలకు అడ్డా కాదని, వీటిని సభ్యసమాజం ఆమోదించదని మిమీ చక్రవర్తి స్పష్టం చేశారు. ఇక ఈ కేసులో సత్వర విచారణ చేపట్టి నిందితుడిని వెంటనే ఉరితీయాలని తాను కోరుతున్నానని ఆమె పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని, ఇంతటి హేయమైన నేరానికి పాల్పడిన నిందితుడిని ఉరితీయాలని ఆమె పేర్కొన్నారు.తమ పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన అంశాలకు సంబంధించి అన్ని పత్రాలను సీబీఐకి అప్పగించామని వెల్లడించారు. ఎలాంటి సమాచారం, ఆధారాలను బహిర్గతం చేయలేదని చెప్పారు. బాధితురాలి కుటుంబానికి తనతో పాటు, బెంగాల్ ప్రజల సానుభూతి ఉందని అన్నారు. ఇది చాలా పెద్ద నేరం, నిందితుడిని ఉరితీయడమే సరైన శిక్ష అని స్పష్టం చేశారు. దోషిని ఉరితీస్తేనే దాన్నుంచి ప్రజలు గుణపాఠం నేర్చుకుంటారని చెప్పారు. అయితే ఏ ఒక్క అమాయకుడినీ శిక్షించరాదని మమతా బెనర్జీ పేర్కొన్నారు.

# వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నేరస్తుడిని ఉరి తీయాలి

## మమతా బెనర్జీ



**కోల్‌కతా :** కోల్‌కతాలోని ఆర్జీ కార్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని, ఇంతటి హేయమైన నేరానికి పాల్పడిన నిందితుడిని ఉరితీయాలని ఆమె పేర్కొన్నారు. తమ పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన అంశాలకు సంబంధించి అన్ని పత్రాలను సీబీఐకి అప్పగించామని వెల్లడించారు.ఎలాంటి సమాచారం, ఆధారాలను బహిర్గతం చేయలేదని చెప్పారు. బాధితురాలి కుటుంబానికి తనతో పాటు, బెంగాల్ ప్రజల సానుభూతి ఉందని అన్నారు. ఇది చాలా పెద్ద నేరం, నిందితుడిని ఉరితీయడమే సరైన శిక్ష అని స్పష్టం చేశారు. దోషిని ఉరితీస్తేనే దాన్నుంచి ప్రజలు గుణపాఠం నేర్చుకుంటారని చెప్పారు. అయితే ఏ ఒక్క అమాయకుడినీ శిక్షించరాదని మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఇక కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను దేశవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలు, ప్రజా సంఘాలు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ ఘటనలో సత్వర విచారణ చేపట్టి నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. దర్యాప్తులో జాప్యం జరగకుండా బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా వ్యవహరించాలని కోరుతున్నారు.

# సీఎంను జైల్లో పెట్టడం ఇదే తొలిసారి



## గోపాల్ రాయ్

**విశ్వంభర, ఢిల్లీ:** దేశానికి స్వాతంత్య్రం లభించిన అనంతరం ఎన్నికైన ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని జైలులో పెట్టడం ఇదే తొలిసారని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత గోపాల్ రాయ్ అన్నారు. ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను జైల్లో నిర్బంధించడంతో ఢిల్లీ మంత్రి కైలాష్ గెహ్లోట్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారని, ఇది సానుకూల చర్యని ఆయన పేర్కొన్నారు.కాగా, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆధునిక స్వాతంత్ర సమరయోధుడని ఢిల్లీ మంత్రి కైలాష్ గెహ్లోట్ అభివర్ణించడాన్ని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా ఎద్దేవా చేశారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గెహ్లోట్ రాజకీయ ప్రసంగం చేశారని దుయ్యబట్టారు. గెహ్లోట్ తీరు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థలను అవమానించేలా ఉందని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్‌ను మొఘల్ పాలకుడు నదీర్ షాతో పోల్చడం సమంజసమని వీరేంద్ర సచ్‌దేవా ఎద్దేవా చేశారు.అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలను కైలాష్ గెహ్లోట్ ప్రశంసిస్తూ ప్రసంగించడం చూస్తేంటే ఆయన స్వాతంత్య్ర వేడుకలను ఉద్దేశించి కాకుండా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడినట్టు ఉందని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా అన్నారు.స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో కైలాష్ గెహ్లోట్ పాత విద్యుత్, మంచినీటి పథకాల గురించి ప్రస్తావించినా, కేజ్రీవాల్‌ను నిలువరించేందుకు జాతి వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించినా ఆయన ప్రసంగం అంతా రాజకీయ ప్రచారంలానే సాగిందని దుయ్యబట్టారు.

# భారత్, బంగ్లా సరిహద్దులో.. తొలిసారి స్వీట్లు పంచుకున్న మహిళా జవాన్లు



**కోల్‌కతా:** దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో అరుదైన సంఘటన జరిగింది. ఇరు దేశాలకు చెందిన మహిళా జవాన్లు తొలిసారి సాంప్రదాయ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడంతోపాటు స్వీట్లు పంచుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం ఉదయం గెడే సరిహద్దులోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) పోస్ట్ సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది. 32వ బెటాలియన్‌కు చెందిన ఆరుగురు బీఎస్ఎఫ్ మహిళా జవాన్లు, బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ)కు చెందిన మహిళా సైనికులు కలుసుకున్నారు. భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకోవడంతోపాటు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.కాగా, భారత్, బంగ్లాదేశ్ సరిహద్దు దళాల మధ్య పరస్పర గౌరవం, స్నేహభావానికి ఈ సాంప్రదాయం ప్రతీక అని 32వ బెటాలియన్ బీఎస్ఎఫ్ కమాండెంట్ సుజీత్ కుమార్ తెలిపారు. అయితే ఇరు దేశాల సరిహద్దు దళాలకు చెందిన మహిళా సైనికులు ఈ వేడుకలో పాల్గొనడం తొలిసారి అని వెల్లడించారు.మరోవైపు బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత ఆ దేశంలో ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో 4,000 కిలోమీటర్ల సరిహద్దులో హై అలర్ట్ కొనసాగుతున్నది.

# దీదీపై నోరుపారేసుకుంటున్న కాషాయ పాలకులు: శత్రుఘ్న సిన్హా



**కోల్ కతా:** మహిళా సాధికారత గురించి మనం మాట్లాడుతున్న సందర్భంలో దేశంలో కేవలం ఒకే ఒక్క మహిళా సీఎం ఉన్నారని టీఎంసీ ఎంపీ శత్రుఘ్న సిన్హా అన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విషయం ఉన్న మహిళని ప్రశంసించారు. ఇంతటి ఉన్నత స్థానానికి చేరుకునేందుకు ఆమె ఎంతగానో శ్రమించారని, జీవితమంతా పోరాడారని కొనియాడారు.విజయవంతమైన నేతగా ఆమె తనను తాను నిరూపించుకున్నారని అన్నారు. ఆమెను చూసి దేశమంతా గర్విస్తున్నదని చెప్పారు. కాషాయ పాలకులు ఈ విషయం జీర్ణించుకోలేకపోతున్నారని, దీదీకి ఉన్న ఆదరణను చూసి తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. దీదీ లక్ష్యంగా బీజేపీ నేతలు నిత్యం విమర్శల దాడికి పదును పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాషాయ నేతలు ఆమెను నేరుగా నిందిస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెనుదుమారం రేపుతోంది. ఈ ఘటన సభ్యసమాజానికి సిగ్గుచేటని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ గురువారం ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిని సందర్శించి ఆందోళన చేపట్టిన డాక్టర్లు, విద్యార్థులతో ముచ్చటించారు. మీకు న్యాయం జరుగుతుంది..మీ ఆవేదనను విని అర్థం చేసుకునేందుకు తాను స్వయంగా ఇక్కడకు వచ్చానని ఈ సందర్భంగా గవర్నర్ ఆనంద బోస్ భరోసా ఇచ్చారు.

# గిన్నిస్‌కెక్కిన జాతీయ గీతాలాపన

**న్యూఢిల్లీ:** జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామీ విజేత రిక్కీ కేజ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ గీతాలాపన గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. యూకేకు చెందిన 100 మందితో కూడిన రాయల్ ఫిలార్మోనిక్ ఆర్కెస్ట్రా, మన దేశానికి చెందిన హరిప్రసాద్ చౌరాసియా, రాకేశ్ చౌరాసియా, రాహుల్ శర్మ, అమాన్, అయాన్ అలీ బంగాశ్, రాహుల్ శర్మ, జయంతి కుమరేశ్, షేక్, కలీషాబి మహబూబ్, గిరిధర్ ఉడుప వంటి సంగీతవేత్తలు కలిసి జాతీయ గీతానికి సంగీతాన్ని ఇచ్చారు.కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన 14 వేల మంది ఆదివాసీ చిన్నారులు భారతదేశ చిత్రపటం, భారత్ అనే అక్షరక్రమంలో నిల్చొని జాతీయ గీతాలాపన చేశారు. ఈ వీడియోను రిక్కీ కేజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



# ఐదేళ్లుగా ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛను అందించేందుకు కట్టుబడి ఉన్నాం



## ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

**విశ్వంభర, అమరావతి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఏపీలో ఘనంగా జరిగాయి. సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను తిరిగి తెస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించిందన్న ఆయన.. ఐదేళ్లుగా ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛను అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనకు శ్రీకారం చుట్టామన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన శాఖల్ని పునరుద్ధరించే లక్ష్యంతో 100 రోజుల ప్రణాళికతో అన్ని శాఖల్లో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విభజనతో ఏర్పడిన నవ్యాంధ్రకు రాజధాని కూడా లేని పరిస్థితిలో నాడు పాలన ప్రారంభించామని గుర్తుచేసుకున్నారు. అలాంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని పట్టాలెక్కించామన్నారు. ప్రజల సహకారం, తమకు ఉన్న అనుభవంతో నిలదొక్కుకున్నామన్నారు. 120కిపైగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమంగా నిలిచామన్నారు. రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులకు వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించామని తెలిపారు.



## శ్రీశైలంలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

**విశ్వంభర, శ్రీశైలం:** శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి మహాగణపతి పూజ జరిపిన తర్వాత ఈవో డి.పెద్దిరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎందరో దేశభక్తుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను వివరించారు. గత ఏడాది కాలంలో దేవస్థానం సాధించిన ప్రగతిని తెలియజేశారు.శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించే భక్తుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని ఈవో పెద్దిరాజు అన్నారు. భక్తుల రద్దీకి అనుణంగా ఆయా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆయా సౌకర్యాల కల్పనకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. క్షేత్రాభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. సిబ్బంది కూడా క్షేత్రాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. కాగా, ఈ వేడుకల్లో భాగంగా నందికట్కూరుకు చెందిన సాయిలిక్షిత, లిక్షితా శ్రీ నృత్య కళాశాల వారు దేశభక్తి గీతాలకు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు.

## తిరుమలలో శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



**విశ్వంభర, తిరుమల :** తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం నుంచి శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు తీసుకువచ్చి హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విగ్రహాలకు అభిషేకం చేశారు.వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట , మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. పవిత్రోత్సవాల కారణంగా ఆలయంలో తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుడివాడలో అన్న క్యాంటీన్లను ప్రారంభించిన చంద్రబాబు



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఐదేండ్లుగా నిలిచిపోయిన అన్న క్యాంటీన్లను గురువారం నుంచి ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వంద క్యాంటీన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కృష్ణాజిల్లా గుడివాడలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, మంత్రులు కొల్లు రవీంద్ర, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొని పలువురికి భోజనం వడ్డించారు. అనంతరం పేదలతో కలిసి భోజనం చేశారు. అన్న క్యాంటీన్లలో రూ.5 కే భోజనం, అల్పాహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేశారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో నిర్వహించిన అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వంమూసివేసింది. అధికారంలోకి వచ్చాక తిరిగి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయు ప్రభుత్వం తాజాగా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. 203 క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించాలని మొదట భావించినా భవన నిర్మాణ పనులు పూర్తి కానందున తొలి విడతలో 100 క్యాంటీన్లను ప్రారంభించారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు అన్న క్యాంటీన్లు ప్రారంభించారు.

## ఏపీలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం



### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విశ్వంభర, కాకినాడ:** ఏపీలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంతృత్య పోకడలు, జాతీ సంపదను దోచుకోవడం, ప్రజలను నిర్లక్ష్యం చేసిన పాలకులకు ప్రజలు ఎప్పుడూ బుద్ధి చెబుతారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం షణ్ముఖ వ్యూహంతో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 28 రకాల సామాజిక పెన్షన్లు అందిస్తు అండగా నిలుస్తుందని తెలిపారు.పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరుతో అమలు చేస్తుందని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి మూడంచెల విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడం, సర్పంచులకు అధికారాలు, సాతంత్ర్య, గణ దినోత్సవా వేడుకల నిర్వహణకు నిధుల పెంచడం లాంటి కార్యక్రమాలు ప్రారంభించామని స్పష్టం చేశారు. దేశ భక్తి పెంపొందించే విధంగా మైనర్ పంచాయతీలకు పది వేలు, మేజర్ పంచాయతీకు రూ. 25 వేలు అందిస్తున్నామని వివరించారు.

## టీటీడీ ఉద్యోగులు అంకితభావంతో సేవలందించాలి: ఏఈవో



**తిరుమల:** తిరుమలకు వచ్చే భక్తులు దివ్యానుభూతి పొందేలా టీటీడీ ఉద్యోగులు, సిబ్బంది అకింతభావంతో సేవలందించాలని అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి సూచించారు. గురువారం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. భారత జాతి స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానేతలు తమ జీవితాలను అంకితం చేశారని అన్నారు.హిందూ సనాతన ధర్మం, పురాణాలు, పవిత్ర గ్రంథాలు నిస్వార్థ సేవ, త్యాగం, సత్యాన్ని బోధించాయని వాటి స్ఫూర్తితో స్వాతంత్ర్యం సాధించామని వెల్లడించారు. వారి మార్గంలో ప్రయాణిస్తూ ఉద్యోగులందరూ టీమ్ వర్క్‌తో సేవలను అందజేస్తామని ప్రతిజ్ఞ చేయాలని కోరారు. తిరుమలకు ప్రతి రోజు దాదాపు 85 వేల మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పిస్తున్నామని, టీటీడీ ఉద్యోగులు నాణ్యమైన అన్నప్రసాదాలను అందజేస్తూ, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో 24 గంటలూ సేవలందిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో యాత్రికులకు మెరుగైన సేవలను అందిస్తామని, ప్రపంచవ్యాప్తంగా టీటీడీ ఖ్యాతిని పెంపొందిస్తామని వివరించారు.



## స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులకు నివాళులర్పించిన వైఎస్ జగన్

**విశ్వంభర, అమరావతి :** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి అర్పించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ వేడుకల్లో శాసనమండలి ప్రతిపక్షనేత అప్పిరెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, విడదల రజని, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.అనంతరం వైఎస్ జగన్ ఎక్స్ వేదిక ద్వారా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయుడి హృదయం గర్వంతో నిండే రోజు స్వాతంత్ర్యమని బానిస సంకెళ్లు తెంచుకున్న రోజు ,స్వేచ్ఛా వాయువులు పంచిన రోజని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులందరికీ మనస్ఫూర్తిగా నివాళి అర్పిస్తున్నట్లు వెల్లడించారు.



## నేడు ఎస్ఎస్ఎల్వీ -డీ 3 రాకెట్ ప్రయోగం

**విశ్వంభర, అమరావతి:** నెల్లూరు జిల్లా శ్రీహరికోట షార్ నుంచి ఎస్ఎస్ఎల్వీ -డీ 3 రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ మొదలయ్యింది. శుక్రవారం షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఉదయం ఉదయం 9.17 గంటలకు నింగిలోకి లాంచ్ చేస్తున్నట్టు ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా నింగిలోకి పంపనున్న ఈఓఎస్ -08 శాటిలైట్ ఉపగ్రహం భూ పరిశీలన చేస్తుందని వివరించారు. ఇందు కోసం ఎస్ఎస్ఎల్వీ -డీ 3 ప్రయోగ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా ఈ సంవత్సరం ప్రయోగించనున్న రాకెట్ల వివరాలను వెల్లడించారు. నవంబర్‌లో గగన్‌యాన్ రాకెట్, నావిక్ శాట్ ప్రయోగం చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాదిలో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం ద్వారా ప్రోబ్ శాటిలైట్ నింగిలోకి వెళ్తుందని అన్నారు. నాసా వారి నిస్సార్ ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎం కె3, ఎల్వీఎం 3 రాకెట్ ప్రయోగాల ద్వారా నింగిలోకి విభిన్న ఉపగ్రహాలు పంపనున్నట్లు వివరించారు. మరో ఏడాదిలో రాడార్ ఇమేజింగ్ శాటిలైట్, జియో ఇమేజింగ్ శాటిలైట్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ శాటిలైట్, టీడీఎస్ రాకెట్ ప్రయోగాలకు సిద్ధమవుతుందని చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు.

## ప్రజల విరాళాలతో నడిచే అన్న క్యాంటీన్లకు పచ్చ రంగు ఎందుకు? మాజీ మంత్రి కాకాణి



**అమరావతి :** ఏపీ ప్రభుత్వం గురువారం నుంచి ప్రారంభించిన అన్న క్యాంటీన్లపై మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు కాకాణి గోవర్దన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించి అన్నక్యాంటీన్లు ప్రారంభించడం, వాటికి పచ్చ రంగు వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. క్యాంటీన్లలో ఫొటోలు చంద్రబాబువి, విరాళాలు ప్రజలవా అంటూ నిలదీశారు.గురువారం నెల్లూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వ పథకాలను ఎత్తివేసి పేదలకు పప్పన్నం పెడుతున్నారని విమర్శించారు.14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన బాబు 16 మంది సీనియర్ ఐపీఎస్‌లను వేధించడం అనైతిక పాలనకు పరాకాష్ట అని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే టీడీపీ నాయకులు ఇసుక దోపిడి చేస్తున్నారని, 40 లక్షల టన్నుల ఇసుకను స్టాక్‌యార్డుల నుంచి మాయం చేశారని ఆరోపించారు.

## నారా లోకేష్ పాల్గొన్న వేడుకల్లో డ్రోన్ కలకలం..

### పోలీసుల అదుపులో యువతి



**అమరావతి :** ఏపీలోని గుంటూరు జిల్లాలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో డ్రోన్ కలకలం సృష్టించింది. ఏపీ సీఎం కుమారుడు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్న వేడుకల్లో అనుమతి లేకుండా డ్రోన్‌ను వినియోగించిన యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో డ్రోన్ సంచరించడాన్ని గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.డ్రోన్‌ను ఎగురవేయడాన్ని సెక్యూరిటీ బ్రీచ్ కింద తీసుకున్న అధికారులు డ్రోన్‌ను ఎగురవేసిన యువతిని గమనించి ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరేడ్‌ను రికార్డు చేసేందుకు డ్రోన్ ఎగురవేసినట్టు యువతి వివరించినా, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేయడంపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## డీఆర్డీవో శాస్త్రవేత్త రామ్ నారాయణ్ అగర్వాల్ కన్నుమూత



**విశ్వంభర, హైదరాబాద్:** అగ్ని క్షిపణుల రూపకర్తగా గుర్తింపు పొందిన ప్రముఖ డీఆర్డీఓ శాస్త్రవేత్త డాక్టర్ రామ్ నారాయణ్ అగర్వాల్ (84) కన్నుమూశారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. భారత దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అగ్ని క్షిపణులకు సంబంధించి మొదటి ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన అగర్వాల్‌ను 'అగ్ని మ్యాన్'(అగ్ని క్షిపణి పితామహుడు)గా పేర్కొంటున్నట్లు డీఆర్డీవో వర్గాలు వెల్లడించాయి.రామ్ నారాయణ్ అగర్వాల్ మృతి పట్ల పలువురు శాస్త్రవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు. డీఆర్డీవో ఒక లెజెండ్‌ను కోల్పోయిందని ఆ సంస్థ మాజీ చీఫ్, క్షిపణి శాస్త్రవేత్త డాక్టర్ జి. సతీశ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అగర్వాల్ మృతి పట్ల డీఆర్డీవో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. అగర్వాల్ డైరెక్టర్ ఏఎన్ఎల్‌గా పదవీ విరమణ చేశారని, రెండు దశాబ్ధాలకుపైగా అగ్ని క్షిపణి ప్రోగ్రాంకు సారథ్యం వహించిన ఘనత ఆయనదేనని ప్రశంసించింది.పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్న డాక్టర్ రామ్ నారాయణ్ మృతి విచారకరమని డీఆర్డీవో పేర్కొంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించింది. అగర్వాల్ మృతి పట్ల పలువురు శాస్త్రవేత్తలతోపాటు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

## అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

### ఆకాశమంత ఎత్తుకు వ్యాపించిన దట్టమైన పొగలు..!



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అంబర్‌పేట్‌లోని ఆలీ కేఫ్ వద్ద ఉన్న పెయింట్స్ ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో పలువురు మహిళలు చిక్కుకున్నట్టు తెలిసింది. పెయింట్ డబ్బాలు పేలిపోవటంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. మంటలతో పాటు ఆకాశమంత ఎత్తున దట్టమైన పొగ కూడా అలుముకుంది. అక్కడివారంతా పొగతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మంటల్లో చిక్కుకున్న మహిళను... ఎలాగోలా రక్షించి వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో మంటలను అదుపుచేశారు.

## ఉక్రెయిన్ ఆధీనంలో రష్యా పట్టణం

- మిలిటరీ కార్యాలయం ఏర్పాటు
- ప్రకటించిన అధ్యక్షుడు జెలెన్‌స్కీ



కీవ్, ఆగస్టు 15: రష్యా – ఉక్రెయిన్ యుద్ధం కీలక మలుపు తిరిగింది. రష్యా భూభాగంలోని కుర్స్ ప్రాంతంలో ఉన్న సడ్జా పట్టణాన్ని తమ బలగాలు పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించారు. ఈ పట్టణంలో దాదాపు 5,000 జనాభా ఉన్నారు. పశ్చిమ సైబీరియా చమురు నిక్షేపాల నుంచి ప్రవహించే పైప్‌లైన్లు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. సడ్జా పట్టణంలో ఉక్రెయిన్ సైనిక కమాండర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు జెలెన్‌స్కీ ప్రకటించారు. కాగా, జనవరి నుంచి ఉక్రెయిన్‌లోని 1,175 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని రష్యా ఆక్రమించగా, ఇప్పుడు మొదటిసారిగా రష్యా భూభాగంలోని దాదాపు 800 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఉక్రెయిన్ ఆక్రమించిందని వాషింగ్టన్ కేంద్రంగా పని చేసే ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ తెలిపింది.

**నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్ పేలుళ్ల వెనుక ఉక్రెయిన్?**

రష్యా – యూరోప్ మధ్య ఉండే నార్డ్ స్ట్రీమ్ సహజ వాయువు పైప్‌లైన్‌ల పేలుళ్ల వెనుక ఉక్రెయిన్ బలగాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ఒక కథనం ప్రచురితమైంది. దీని ప్రకారం.. ఉక్రెయిన్‌పైకి రష్యా దండెత్తిన తర్వాత రష్యాను దెబ్బతీసేందుకు గానూ ఆ దేశం నుంచి యూరోప్ వెళ్లే నార్డ్ స్ట్రీమ్ 1, నార్డ్ స్ట్రీమ్ 2 పైప్‌లైన్లను పేల్చేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఓ వ్యాపారవేత్త సూచించారు. ఈ మేరకు 2022 మేలో ఈ ప్రణాళిక అమలు చేయడానికి జెలెన్‌స్కీ ఆమోదం తెలిపారు. అయితే, ఈ విషయం అమెరికా నిఘా సంస్థ సీఐఏకి తెలిసి, ప్రణాళికను విరమించుకోవాలని కోరడంతో జెలెన్‌స్కీ వెనక్కు తగ్గారు. తర్వాత సెప్టెంబర్‌లో జెలెన్‌స్కీకి సంబంధం లేకుండానే అప్పటి ఉక్రెయిన్ సైనికాధికారి జలుజ్నీ ఒక ప్రణాళిక రచించి బాల్టిక్ సముద్రంలో పైప్‌లైన్లను పేల్చేయించారు. కాగా, ఈ వార్తలను ఉక్రెయిన్ ఖండించింది. పైప్‌లైన్ పేలుళ్లలో తమ ప్రమేయం లేదని పేర్కొన్నది.

## ఉద్యోగినులకు నెలసరి సెలవు

### ఒడిశా ప్రభుత్వం నిర్ణయం

**భువనేశ్వర్:** ఒడిశాలో ఉద్యోగినులకు ఒకరోజు నెలసరి సెలవును ఇవ్వనున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేసే ఉద్యోగినులు వేతన చెల్లింపుతో కూడిన నెలసరి సెలవును తీసుకోవచ్చని పేర్కొన్నారు. అయితే, ఈ సెలవు ఐచ్ఛికమని తెలిపారు. కటక్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమానికి హాజరైన తర్వాత ఆమె ఈ ప్రకటన చేశారు. మహిళ రుతు చక్రంలోని మొదటి లేదా రెండో రోజు ఈ సెలవు తీసుకోవచ్చని వెల్లడించారు.

## నర్సుపై లైంగికదాడి, హత్య

**లక్నో:** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన మరువక ముందే యూపీలో ఒక నర్సు సైతం హత్యాచారానికి గురైయ్యారు. ఉత్తరాఖండ్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్న నర్సు జూలై 30న ఇంటికి చేరుకోలేదు. 8 రోజుల తర్వాత ఆగస్టు 8న తన ఇంటికి 1.5 కి.మీ దూరంలోని దిబ్డిబా గ్రామంలో యూపీ పోలీసులు ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఆమె తన నివాస భవనంలోకి వెళ్తుండగా, దాడి చేసి పొదల్లోకి లాక్కుపోయానని, తర్వాత లైంగిక దాడి జరిపి హత్య చేసినట్టు నిందితుడు అంగీకరించాడు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- స్వాతంత్ర్య ఫలితాలు అందరికీ అందాలి
- సూర్యాపేట జిల్లా ప్రజల జీవితాలలో వెలుగు నింపటమే నా లక్ష్యం
- రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**విశ్వంభర, సూర్యాపేట**

ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవం అని, స్వాతంత్ర్య ఫలితాలు అందరికి పంచాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరియడ్ గ్రౌండ్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్ పి సన్ ప్రిత్ సింగ్ తో కలిసిపాల్గొన్నారు. జాతీయ పతాకాని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆవిష్కరించి, వందనాన్ని స్వీకరించి, జాతీయ గీతాన్ని, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. తదుపరి పోలీస్ శాఖ వారిచే ఏర్పాటు చేసిన ఓపెన్ టాప్ వాహనం లో జిల్లా కలెక్టర్, ఎస్పిలతో కలిసి సంప్రదాయ సిద్ద పోలీస్ కవాతు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ మా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలో మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ పథకాలను పేదలకు అందించామని జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా ఆర్ టి సి బస్సు లలో 1.29 కోట్ల మంది మహిళలు ఇప్పటి వరకు ప్రయాణించారని వీరికి 66.84 కోట్ల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం చెల్లించినదని, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ను అందించుటకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ఐదు లక్షల నుండి పది లక్షలకి పెంచటం జరిగిందని జిల్లాలో ఈ పథకం ద్వారా 19096 మంది చికిత్స పొందరాని తెలిపారు. పేదోళ్ల సొంత ఇంటి కలను నెరవేర్చుటకు ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద రాష్ట్రంలో 4.5 లక్షల ఇల్లులు నిర్మించుటకు ఇంటికి 5 లక్షల రూపాయలు చొప్పున ఇవ్వటం జరుగుతుందని, హుజుర్ నగర్ ఆదర్శ కాలనిలో 2160 ఇండ్ల పున్నరుద్దరణ పనులు 74.80 కోట్లతో జరుగుతున్నాయని,అలాగే గ్యాస్ సిలిండర్ ని 500 రూపాయలకే అందిస్తున్నామని ఇప్పటి వరకు జిల్లాలో 1.48 లక్షల మంది లబ్ధిదారులకు 7 కోట్ల రూపాయల సబ్సిడీ తో 2.37 లక్షల గ్యాస్ సిలిండర్లు అందజేయటం జరిగిందని, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విధ్యుత్ ని ఉచితంగా అందజేయటం జరిగిందని జిల్లాలో 1.75 లక్షల కుటుంబాలకు 28.5 కోట్ల రూపాయలతో ఉచిత విద్యుత్ ని అందజేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణ మాఫి చేయటం జరిగిందని జిల్లాలో రెండు విడుతలలో కలిపి 82,593 మంది రైతులకు 573 కోట్లు రుణ మాఫి చేయటం జరిగిందని మంత్రి తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా 3.24 లక్షల ఆహార భద్రత కార్డులకి నెలకి 5,946 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణి చేయటం జరిగిందని,అలాగె 43,125 మంది రైతుల ద్వారా 530 కోట్లు విలువ గల 2,40,578 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించటం జరిగిందని మంత్రి తెలిపారు. నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలో 519.77 కోట్లతో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయటం జరిగిందని,418 కోట్లతో నాగార్జున సాగర్ ఎడమ కాలువ పనులు ఆధునికరించటం జరిగిందని,144 కోట్లతో మూసి ప్రాజెక్ట్ కాలువల ఆధునికరించటం జరిగిందని,244.45 కోట్లతో 20 చెక్ డ్యామ్ లు నిర్మించటం జరుగుతుందని వీటిలో 19 పూర్తి అయ్యాయని, జానపాడు ఎత్తి పోతల పథకం కింద 40 కోట్లతో 210 ఎకరాల భూమిని సేకరించటం జరిగిందని మంత్రి తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 389.14 కోట్ల విలువగల చెక్కు లను 43,711 లబ్ధిదారులకు ఇవ్వటం జరిగిందని తెలిపారు.ధరణిలో జిల్లాలో 56,266 దరఖాస్తులు వచ్చాయని వాటిలో 94 శాతం పరిష్కరించామని మంత్రి తెలిపారు.పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జిల్లా లో ఆగస్టు 5 నుండి ఆగస్టు 9 వరకు స్వచ్ఛదనము -పచ్చదనం విజయవంతంగా చేయటం జరిగిందని,మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా 2,62,000 మందికి జాబ్ కార్డులు ఇవ్వటం జరిగిందని వీరికి 49,12,000 పని దినాలు ఉపాధి కల్పించామని దీనికి గాను 107.38 కోట్ల రూపాయలు చెల్లించామని,49,044 మందికి 36.94 కోట్లు పింఛన్ ఇవ్వటం జరుగుతుందిని,1057 సదరం సర్టిపికెట్స్ ఇచామని,బ్యాంక్ లింకేజి ద్వారా SHG లకు 198.18 లక్షల రుణాలు ఇచ్చామనీ,9.92 కోట్ల వడ్డీ రుణ మాఫి చేయటం జరిగిందని, జిల్లాలో సి సి రోడ్లు, డి యమ్ ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధుల ద్వారా 793 పనులకు 52.85 కోట్లు మంజూరు అయ్యాయని 617 పనులు పూర్తి చేశామని అలాగే జిల్లాలో ని ఐదు మున్సిపాల్టిలలో 108 కోట్లతో పనులు మంజూరు అయ్యాయని పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలిపారు.జిల్లాలో 24 పి హెచ్ సి,122 పల్లె దవాఖానాలు,5 పట్టణారోగ్య కేంద్రాలు,161 ఆరోగ్య కేంద్రాలు,1 జనరల్ అస్పత్రి,3 ఏరియా ఆస్పిటల్స్,1 సి హెచ్ సి లు ఉన్నాయని, జిల్లాలోని గ్రామాలలో, పట్టణాలలో, పాఠశాలలో పీవర్ సర్వే చేయటం జరిగిందని మంత్రి అన్నారు.శాంతి భద్రత లు పరిరక్షణ లో జిల్లా పోలీస్ లు అనుక్షణం పనిచేస్తూ ప్రజలకు మెరుగైన భద్రత, రక్షణ కల్పిస్తునరాని, గంజాయి, ఇతర నార్కోటిక్ డ్రగ్స్ పదార్థాలపై ఉక్కుపాదం మోపి అణిచివేయాలని, డ్రగ్స్ రహిత సమాజానికి ప్రజలలో అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అయినా ఆరు గ్యారంటీ మహాలక్ష్మి , గృహ జ్యోతి, రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలు అమలు కొరకు నిరంతరం కృషి చేస్తానని జిల్లా అభివృద్ధి కి సహకరిస్తున్న ముఖ్యమంత్రి గారికి , ఎమ్మెల్యే లకి , ఏ మ్మెల్సీ లకి , ఎంపి లకి, స్థానిక ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు, పాత్రికేయులకు, జిల్లా అధికార యంత్రాగానికి మరొకసారి శుభాభినందనలు తెలియజేస్తునని మంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా మంత్రి హోదాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో పాల్గొనటం చాలా సంతోషం గా ఉందని, నన్ను 6 సార్లు ఏ మ్మెల్యే గా, ఒకసారి ఎంపి గా, గెలిపించారాని ఈ అదృష్టం కల్పించిన జిల్లా ప్రజలకు ధన్యవాదములు తెలిపారు. ఏ తండా లో అయినా, హరిజన వాడలో అయినా, ఏ గ్రామాంలో అయినా ఉత్తమన్నా మీతోనే ఉంటాడని,సూర్యాపేట జిల్లాను రాష్ట్రం లోనే అగ్రగామిగా నిలుపుతానని, జిల్లా ప్రజల జీవితాలలో వెలుగు నింపటమే నా లక్ష్యం అన్ని మంత్రి తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధులైన సూర్యాపేట నివాసి అంజయ్య, గరిడేపల్లి నివాసి పుల్లారెడ్డి, సూర్యాపేట నివాసి జానకి రాములకు సన్మానం చేశారు.తదుపరి విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను విక్షించి విద్యార్థులతో ఫొటోలు దిగి ప్రోత్సాహించారు.52.44 కోట్ల రూపాయల చెక్కు ని స్వయం సహాయక సంఘాల వారికి,35.36 కోట్ల రూపాయల చెక్కును మెప్మా వారికి మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ పి నాగేశ్వరరావు,ఆర్ డి ఓ వేణు మాధవ్,జడ్పీ సి ఈ ఓ అప్పారావు, డి పి ఓ యాదగిరి, డి డబ్ల్యూ ఓ నరసింహ రావు, డి టి డి ఓ శంకర్, డి ఈ ఓ ఆశోక్, ఉద్యోగులు,సిబ్బంది,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సీటును తెలంగాణేతరుడికి ఇస్తారా?

### మండిపడిన బీఆర్ఎస్ నేతలు



**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ బీఆర్ఎస్ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత కె.కేశవరావు (కేకే) రాజీనామా చేసిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి పేరు ప్రకటించడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణేతర వ్యక్తికి ఎంపీ సీటు కేటాయించడంపై కాంగ్రెస్ అధిష్ఠానంపై బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ నిప్పులు చెరిగారు. తెలంగాణకు చెందిన నేతలు అధిష్ఠానానికి కనిపించడం లేదా అంటూ ధ్వజమెత్తారు.

**తెలంగాణ నేతలు కనిపించడం లేదా?**

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. అధిష్ఠానం పెద్దలు తెలంగాణ కాంగ్రెస్ నేతలను కీలుబొమ్మల్లా ఆడిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాజ్యసభ సభ్యత్వానికి కేకే రాజీనామా చేస్తే ఆ పార్టీ తరఫున అభ్యర్థిగా నిలబెట్టేందుకు వీహెచ్ సహా బీసీ, ఎస్సీ, మైనార్టీ నాయకులు వారికి కనిపించలేదా అంటూ ప్రశ్నించారు. తెలంగాణ విషయంలో అభిషేక్ సింఘ్వి ఏ రోజూ సానుకూలంగా స్పందించలేదని, అలాంటి వారికి ఎలా సీటు కేటాయిస్తారని వద్దిరాజు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అర్హులు లేనట్లు ఢిల్లీ నేతకు రాజ్యసభ సీటు ఇవ్వడం తెలంగాణ ప్రజలను అవమానించడమే అని అన్నారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభించడం సంతోషమని, అయితే మంత్రులు చెప్పినట్లుగా ఏడెనిమిది నెలల్లో దాన్ని పూర్తి చేయడం సాధ్యం కాదన్నారు. ప్రాజెక్టులకు కాంగ్రెస్ నేతలు స్విచ్ ఆన్ చేయడం హర్షించదగ్గ విషయమని, అయితే అదే పనిగా గత పాలకులను అవమానపరచడం సరికాదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.

**కేసీఆర్ వల్లే రేవంత్ రెడ్డి సీఎం..!**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ తేవడం వల్లే రేవంత్ రెడ్డి సీఎం, కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయ్యారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఎంగా ఉన్నప్పుడు ఇతర రాష్ట్రాల వారికి రాజ్యసభ సీటు కేటాయించాలంటూ కేసీఆర్‌పై పెద్దస్థాయిలో ఒత్తిళ్లు వచ్చాయని, అయినా ఆయన లెక్క చేయకుండా రాష్ట్ర నేతలకే ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేకులకు కాంగ్రెస్ పదవులు ఇవ్వడం చాలా బాధ కలిగిస్తోందని మాజీ మంత్రి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పదవులు అన్నీ తెలంగాణేతరులకే ఇచ్చారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న బీసీ నేతలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నేతలు లేదా తెలంగాణకు అనుకూలంగా ఉన్న వారికే సీట్లు కేటాయించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హితవుపలికారు.

## ఇండ్లు, ఆటో రుణాలకు.. వడ్డీరేట్లు పెంచేసిన ఎస్బీఐ

**విశ్వంభర, బిజినెస్:** ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంక్.. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) వడ్డీరేట్లు పెంచేసింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్ఆర్) 10 బేసిక్ పాయింట్లు పెంచడంతో వినియోగ, ఆటో రుణాలు పిరం కానున్నాయి. పెంచిన వడ్డీరేట్లు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని తెలిపింది. గత జూన్ లో చివరిసారిగా ఎస్బీఐ తన ఎంసీఎల్ఆర్ సవరించింది. తాజాగా ఎంసీఎల్ఆర్ సవరణతో వివిధ టెన్యూర్‌ల రుణాలపై వడ్డీరేటు 8.20 శాతం నుంచి 9.1 శాతానికి చేరుతుంది. ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ 8.20 కాగా, నెల నుంచి మూడు నెలల గడువు గల రుణాలపై వడ్డీరేటు 8.45 నుంచి 8.5 శాతానికి చేరుకున్నది. ఆరు నెలల గడువు గల రుణాలపై 8.85 శాతం, ఏడాది టెన్యూర్ రుణంపై వడ్డీరేటు 8.95 శాతానికి పెంచుతున్నట్లు ఎస్బీఐ తెలిపింది. రెండేండ్ల గడువు గల రుణంపై వడ్డీరేటు 9.05 శాతం, మూడేండ్ల గడువు గల రుణంపై వడ్డీరేటు 9.1 శాతానికి పెరిగింది. అయితే రుణ గ్రహీతల సిబిల్ స్కోర్ ఆధారంగా బ్యాంకులు వడ్డీరేటు ఖరారు చేస్తాయి. ఎంసీఎల్ఆర్ రేట్లు పెంచడంతో ఆటో, వినియోగ, గృహ రుణాలు భారం కానున్నాయి.

## స్వేచ్ఛ, స్వాతంత్ర్యం విలువను బంగ్లా పరిణామాలు గుర్తుచేశాయ్

### సీజేఐ డీవై చంద్రచూడ్

**న్యూఢిల్లీ:** మనకు లభించిన స్వాతంత్య్రం, స్వేచ్ఛ ఎంతో ముఖ్యమైనవని, ఈ హక్కుల విలువ ఏమిటో ఇటీవల మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలు మనకు గుర్తు చేస్తున్నాయని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆ దేశ ప్రధాని హసీనా రాజీనామా చేసి దేశాన్ని వదిలిపెట్టి వెళ్లగా, ఆ దేశంలో మైనారిటీగా ఉన్న హిందువులపై విస్తృతంగా దాడులు జరుగుతున్న క్రమంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు.స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సుప్రీం కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిణామాలు మనకు స్వేచ్ఛ ఎంత విలువైనదో తెలియజేస్తున్నాయని అన్నారు.

## ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**విశ్వంభర, కాచిగూడ :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటాసైన్స్, బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఓరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ, చదివిన యువతి, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050/47, www.nationalskillacademy.inలో సంప్రదించవచ్చని సూచించారు.

## కేజ్రీవాల్‌ను నదీర్ షాతో పోల్చడం సమంజసం

### ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా



**ఢిల్లీ:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆధునిక స్వాతంత్ర సమరయోధుడని ఢిల్లీ మంత్రి కైలాష్ గెహ్లాట్ అభివర్ణించడాన్ని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా ఎద్దేవా చేశారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గెహ్లాట్ రాజకీయ ప్రసంగం చేశారని దుయ్యబట్టారు. గెహ్లాట్ తీరు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థలను అవమానించేలా ఉందని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్‌ను మొఘల్ పాలకుడు నదీర్ షాతో పోల్చడం సమంజసమని వీరేంద్ర సచ్‌దేవా ఎద్దేవా చేశారు. అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలను కైలాష్ గెహ్లాట్ ప్రశంసిస్తూ ప్రసంగించడం చూస్తేంటే ఆయన స్వాతంత్య్ర వేడుకలను ఉద్దేశించి కాకుండా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడినట్టు ఉందని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా అన్నారు.స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో కైలాష్ గెహ్లాట్ పాత విద్యుత్, మంచినీటి పథకాల గురించి ప్రస్తావించినా, కేజ్రీవాల్‌ను నిలువరించేందుకు జాతి వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించినా ఆయన ప్రసంగం అంతా రాజకీయ ప్రచారంలానే సాగిందని దుయ్యబట్టారు. ఆయన ప్రసంగం గమనిస్తే అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, అతిషీల కంటే తానే గొప్ప అరాచక రాజకీయ నాయకుడిగా నిరూపించుకోవాలనుకున్నట్లు అనిపించిందని వీరేంద్ర సచ్‌దేవా ఎద్దేవా చేశారు.




# చిత్రసీమలో కొనసాగాలా.. వద్దా.. అన్నది ప్రేక్షకుల నిర్ణయం

## ఎమర్జెన్సీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కంగనా రనౌత్

నటనకు ఫుల్‌స్టాప్ పెట్టనున్నారంటూ వస్తోన్న వార్తలపై కంగనా రనౌత్ మరోసారి స్పందించారు. తన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు. ఇండస్ట్రీలో కొనసాగాలా.. లేదా అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారన్నారు. 'నేను నటిగా కొనసాగాలా.. వద్దా అనేది ప్రేక్షకుల తీర్పుపై ఆధారపడి ఉంటుంది. రాజకీయాల్లోకి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ, ప్రజలు నన్ను గెలిపించి నాయకురాలిని చేశారు. ఏ పార్టీ తరఫున పోటీ చేశాననేది పక్కన పెడితే.. నేను ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజలు బలంగా కోరుకున్నారు. అందుకే నన్ను గెలిపించారు. అలాగే 'ఎమ్జన్సీ' ఫలితంపై నా నటన జీవితం ఆధారపడి ఉంది. నేను అనుకున్న విజయం సొంతమైతే ఇండస్ట్రీలో ఉంటాను. ఒకవేళ రాజకీయాల్లో నా అవసరం ఎక్కువ ఉందని భావిస్తే ఆ రంగంలోనే కొనసాగుతా. మనకు అవసరమైన, గౌరవనీయమైన చోట ఉండాలి. ప్రస్తుతానికి ఈ విషయంలో నేను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని చెప్పారు. ఇక కంగనా నటించిన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. పలు వాయిదాల అనంతరం సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తూ నిర్మాతగానూ వ్యవహరించిన కంగనా ఇందిరాగాంధీ పాత్రలో నటించారు. జయప్రకాష్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పాత్రలో శ్రేయస్ తల్పడే కనిపించనున్నారు.

# చియాన్ విక్రమ్ నటన అదుర్స్

## తంగలాన్‌పై ప్రేక్షకుల చీర్స్

విలక్షణతకు మారు పేరు చియాన్ విక్రమ్. తను గతంలో నటించిన 'శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ' వంటి చిత్రాలెన్నో ఆయన ప్రత్యేకతకు అద్దం పడుతుంటాయి. ఆ కోవలోనే తాజాగా వచ్చిన చిత్రం 'తంగలాన్'. రజనీకాంత్‌తో కబాలి, కలా వంటి చిత్రాలను రూపొందించిన పా రంజిత్ ఈ సినిమాకు దర్శకుడు. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పటికే చాలా ప్రాంతాలో సనిమా విడుదలవడంతో అనేక మంది మూవీని చూసి తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. విక్రమ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ ఈ చిత్రమని, విక్రమ్ నటనకు ఓ దండం అంటూ చాలా మంది హ్యాట్సాఫ్ చెబుతున్నారు. మరికొంతమంది ఓ మెట్టు పైకెక్కి విక్రమ్ ఓ పది మంది కమల్‌హాసన్‌లను చూసినట్లుగా ఉందని కొనియాడుతున్నారు. పార్వతి, మాళవికల నటన న్యాచురల్‌గా ఉందని, పా రంజిత్ తీసుకున్న స్జబెక్ట్ ఎక్సలెంట్‌గా ఉందంటున్నారు. సినిమా కోరాల్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యం కేజీఎఫ్ కన్నా బాగా చయించారని పోస్టు చేస్తున్నారు. అదేవిధంగా జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా రేంస్థాయిని రెట్టింపు చేసిందని ముఖ్యంగా బ్యాగ్రౌండ్ స్కోర్ గూస్ బంప్స్ తెచ్చేలా ఉందంటూ చాలామంది సినిమాను ఆకాశానికెత్తేస్తున్నారు. తమిళనాట అయితే అభిమానుల సందడి వీర లెవల్‌లో ఉంది, విక్రమ్‌కు అస్కార్ వచ్చేఏస్తుందనేలా కామెంట్లు చేస్తున్నారు. ఈ మూవీ తమిళ బాహుబలి అని పేరు పెట్టేస్తున్నారు.



# డబుల్ ఇస్మార్ట్ ..ప్రేక్షకులకు నిరాశే

ఇస్మార్ట్ శంకర్'తో రామ్‌లోని సరికొత్త కోణాన్ని దర్శకుడు పూరి జగన్నాథ్ ఆవిష్కరించారు. ఆ కలయికలో కొనసాగింపుగా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. సంజయ్‌దత్ ఇందులో కీలక పాత్ర పోషించడం సినిమాకి మరింత ఆకర్షణగా నిలిచింది. బిగ్ బుల్ (సంజయ్‌దత్) విదేశాల్లో విలాసాలతో జీవిస్తూ చీకటి సామ్రాజ్యాన్ని నడుపుతుంటాడు. భారతదేశాన్ని ముక్కలు చేయాలనేది అతని కల. అతని కోసం ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 'రా' వేట కొనసాగుతూ ఉంటుంది. ఇంతలో బిగ్‌బుల్ మెదడులో కణితి ఉందని, దాని ప్రభావంతో కొన్ని నెలలు మాత్రమే బతికే అవకాశం ఉందని వైద్యులు చెబుతారు. మరో వందేళ్ల ప్రణాళికలతో బతుకుతున్న బిగ్ బుల్ తాను చనిపోకూడదని, ఎలాగైనా బతకాలనుకుంటాడు. అందుకు మార్గాల్ని అన్వేషించినప్పుడు మెదడులో చిప్ పెట్టుకుని హైదరాబాద్‌లో జీవిస్తున్న ఒకే ఒక్కడు ఇస్మార్ట్ శంకర్ (రామ్) పేరు తెరపైకొస్తుంది. బిగ్ బుల్ మెమొరీస్ అన్నీ కాపీ చేసి, ఇస్మార్ట్ శంకర్ మెదడులోని చిప్‌లో పేస్ట్ చేస్తారు. దాంతో శరీరం ఇస్మార్ట్ శంకర్‌ది అయినా, ఆలోచనలన్నీ బిగ్ బుల్‌వే కాబట్టి అతనికి మరణం ఉండదనేది వాళ్ల ప్లాన్. మరి ఇస్మార్ట్ శంకర్‌లోకి బిగ్ బుల్ ఆలోచనలు వచ్చాక ఏం జరిగింది?ఇస్మార్ట్ ఎలాంటి లక్ష్యంతో ఉంటాడు?అతని సొంత జ్ఞాపకాలు, అతని ప్రేమ, లక్ష్యాలు ఏమయ్యాయి అన్నది చిత్ర కథ. ఇస్మార్ట్ శంకర్' కొనసాగింపునకు తగ్గ సరకున్న కథనే రాసుకున్నాడు పూరి జగన్నాథ్. ఒక లక్ష్యంతో ఉన్న కథానాయకుడి మెదడులోకి మరో వ్యక్తి వస్తే ఎలా అనే కాన్‌ఫ్లిక్ట్ తొలి సినిమాకి దీటుగానే అనిపిస్తుంది. మరోవైపు ఇస్మార్ట్ పాత్రకు బ్రాండ్‌గా మారిపోయిన రామ్ ఉండనే ఉన్నాడు. ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలని ఎక్కువ జాగ్రత్తపడ్డారో లేక, తన పాత సినిమాల్ని గుర్తు చేయాలనుకున్నాడో తెలియదు. అర్థవంతంగా లేని అలీ ట్రాక్‌తోనూ.. తన శైలి వేగం, పదును లేని కథనంతో చాలా చోట్ల సన్నివేశాల్ని పూరి జగన్నాథ్ సాగదీశాడు. పోశమ్మ కథని పరిచయం చేస్తూ సినిమా మొదలవుతుంది. ఆ ఎపిసోడ్‌తోనే హీరో ప్రతీకారం తీర్చుకోవడం కోసం ఎదురు చూస్తున్నాడని, ఇదొక ప్రతీకార కథ అని అర్థమైపోతుంది. తొలి సన్నివేశంలోనే దాదాపుగా కథ రివీల్ అయిపోయి, చాలాసేపు అక్కడే ఆగిపోతుంది. తెరపై పాత్రలు పరిచయం అవుతుంటాయి, సన్నివేశాలు సాగిపోతుంటాయి తప్ప ప్రేక్షకుడికి మాత్రం ఎలాంటి అనుభూతి కలగదు. రామ్ పోతినేని తన బ్రాండ్ ఇస్మార్ట్ నటనతోనూ, హీరోయిన్‌తో కలిసి చేసే అల్లరే కాస్త ఉపశమనం. మరోవైపు బోకా పాత్రలో అలీ పరిచయం, విచిత్రమైన వేషధారణ కొద్దివరకు హాస్యం పంచినా, ఆ ట్రాక్ సాగుతున్న కొద్దీ ప్రేక్షకులకు చికాకు తెప్పిస్తుంది. ద్వితీయార్థంలోనైనా మలుపులేమైనా ఉంటాయేమోనని ఎదురు చూస్తే అక్కడా నిరాశే. హీరో ఎందుకు ప్రతీకారంతో రగిలిపోతుంటాడో, బిగ్ బుల్ ఇండియా రాక వెనక ఎవరున్నారో రివీల్ అయ్యే అంశాలు తప్ప మరేదీ ఆకట్టుకోదు. ద్వంద్వార్థాలతో కూడిన చాలా సంభాషణలు, కొన్ని పాత్రల హావభావాలు చాలా చోట్ల ఇబ్బంది పెడతాయి. మదర్ సెంటిమెంట్ పర్వాలేదనిపిస్తుంది. మెమొరీ కాపీ, పేస్ట్ అంటూ కథ రాసుకున్న పూరి జగన్నాథ్ తన సినిమాల్లోని హీరోల్ని, కొన్నిచోట్ల అపరిచితుడు పాత్రని పేస్ట్ చేసి సినిమా తీశాడేమో అనిపిస్తుంది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో రామ్‌ని చూసినప్పుడు అతని కోసమే పుట్టిన పాత్ర అనిపించింది. మరోసారి ఆ పాత్రపై తన ప్రభావం చూపించాడు రామ్. హుషారైన మేనరిజమ్స్, డ్యాన్స్, డైలాగ్ డెలివరీతో మరోసారి అదరగొట్టాడు. ఈసారి కొన్నిచోట్ల సెంటిమెంట్ కూడా పండించి తన పాత్రకి పూర్తి న్యాయం చేశాడు. కావ్య థాపర్ అందంగా కనిపించింది. పూరి సినిమా హీరోయిన్ అనిపించుకుంది. డ్యాన్స్, యాక్షన్ సన్నివేశాల్లోనూ ప్రభావం చూపించింది. సంజయ్‌దత్ పాత్ర గురించి చెప్పుకోవల్సినంత ఏమీ లేదు. నటన పరంగా ఆయన తక్కువ చేసిందేమీ లేదు కానీ, ఆ పాత్రలోనే బలం లేదు.



# మరో సినిమాను లైన్‌లో పెట్టిన విశ్వక్‌సేన్



టాలీవుడ్ యాక్టర్ విశ్వక్‌సేన్ ఇటీవలే గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో మెకానిక్ రాకీ సినిమాలో నటిస్తున్నాడు విశ్వక్ సేన్. ఈ మూవీలో మీనాక్షి చౌదరి, శ్రద్ధాశ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా విశ్వక్‌సేన్ కొత్త సినిమా విఎస్ 13 ప్రీ లుక్ విడుదల చేయగా.. విశ్వక్‌సేన్ వైట్ షర్ట్ అండ్ ఖాకీ ప్యాంట్‌లో పిస్తోల్‌తో గ్యాంగ్ వార్‌ను నియంత్రించే పోలీస్‌గా కనిపిస్తున్న హాఫ్ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. తాజాగా విఎస్13 లాంచ్ చేశాడు విశ్వక్‌సేన్. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. శ్రీధర్ గంటా కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రొడక్షన్ నంబర్ 8గా రానున్న ఈ మూవీ షూటింగ్ త్వరలోనే షురూ కానుంది. నానితో దసరా లాంటి బ్లాక్ బస్టర్ హిట్‌ను అందించిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి దీనిని తెరకెక్కిస్తున్నాడు. హిట్ తర్వాత ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ మరోసారి పోలీసాఫీసర్ గెటప్‌లో కనిపించబోతున్నాడు. హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో కన్నడ భామ సంపద హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫర్.





# తెలంగాణ సంస్కృతికి దగ్గరగా పొట్టేల్

మల్లేశం, వకీల్‌సాబ్ సినిమాలతో నటిగా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న టాలీవుడ్ భామ అనన్య నాగళ్ల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పొట్టేల్. 'సవారీ' ఫేం సాహిత్ మోత్ఖురి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో యువ చంద్ర కృష్ణ హీరోగా నటిస్తున్నాడు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి మేక సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. గుర్రంగట్టు ప్రాథమిక పాఠశాల ముందు తన కుటుంబంతో దిగిన లుక్ ఒకటి షేర్ చేస్తూ.. ఈ మూవీని దసరా కానుకగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే విడుదల తేదీ ఎప్పుడనేది క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. పొట్టేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగను హైలెట్ చేస్తున్న దృశ్యాలు.. వేడుకల్లో అమ్మవారి ముందు పొట్టేల్‌ను బలి ఇవ్వడం, జోగిని రంగం ప్రదర్శించడం లాంటి విషయాలు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ చిత్రాన్ని ఎన్ఐఎస్ఏ ఎంటర్‌టైనర్‌మెంట్ బ్యానర్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రగ్యా సన్నిది క్రియేషన్స్ బ్యానర్‌పై సురేష్ కుమార్ సడిగే సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరీ, నీల్ సీన్, చత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# హరీష్ శంకర్ ..మార్క్ కనిపించని చిత్రం

## సాదాసీదాగా సాగిన మిస్టర్ బచ్చన్ మూవీ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈసారి బాక్సాఫీస్ పోటీలో నిలిచిన చిత్రాల్లో 'మిస్టర్ బచ్చన్' ఒకటి. టీజర్, ట్రైలర్లలో రవితేజ మార్క్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ పుష్కలంగా కనిపించడం.. పాటల్లో భాగ్యశ్రీ అందచందాలు ఆకట్టుకోవడంతో ప్రేక్షకుల్లో దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దమ్ము, ధైర్యం, నిజాయితీ కలిగిన ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ బచ్చన్ నమ్మిన విలువల కోసం అవసరమైతే దేశ ప్రధాని మాటకైనా ఎదురు చెప్పేందుకు వెనకాడడు. అతను ఓసారి అవినీతి పరుడైన ఓ పొగాకు వ్యాపారిపై రైడ్ చేసి పెద్ద మొత్తంలో నల్లధనాన్ని పట్టుకుంటాడు. కానీ, పై అధికారులు బచ్చన్‌ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తారు. దీంతో అతను సొంతూరు కోటిపల్లికి వెళ్లి ఆర్కెస్ట్రా ట్రూప్ పెట్టుకుంటాడు. అక్కడే జిక్కీ (భాగ్యశ్రీ)ని చూసి తొలి చూపులోనే మనసు పారేసుకుంటాడు. వీళ్ల ప్రేమను పెద్దల అంగీకారంతో పెళ్లి పీటలెక్కిద్దామనుకుంటున్న తరుణంలో.. బచ్చన్‌కు మళ్లీ ఉద్యోగంలో చేరమని ఆదాయపన్ను శాఖ నుంచి ఫోన్ వస్తుంది. దీంతో ఓవైపు పెళ్లి సెట్టయినా తన డ్యూటీలో భాగంగా ఎంపీ ముత్యం జగ్గయ్య (జగపతిబాబు) ఇంట్లో రైడ్ చేయాల్సి వస్తుంది. దేశ చరిత్రలోనే ఆదాయ పన్ను శాఖ చేసిన ఓ అతి పెద్ద రైడ్‌ను ఆధారం చేసుకొని హిందీ రైడ్‌ను రూపొందించిన సంగతి తెలిసిందే. హరీష్ ఆ కథనే తనదైన శైలి మార్పులు – చేర్పులతో.. రవితేజ మార్క్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ జోడించి సరికొత్తగా తెరపై చూపించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా మాతృకతో పోల్చితే ఈ చిత్ర విషయంలో హరీష్ చేసిన పెద్ద మార్పు.. అక్కడ లేని లవ్‌ట్రాక్‌ను ఇక్కడ జోడించడమే. అదే ఈ సినిమాకి ప్రధాన బలం. ప్రథమార్ధాన్ని నిలబెట్టడంలో.. ప్రేక్షకులకు కావాల్సినంత కాలక్షేపాన్నివ్వడంలో ఈ ట్రాకే ముఖ్య భూమిక పోషించింది. మిస్టర్ బచ్చన్ పేరు వెనకున్న కథ.. ఆ క్యారెక్టర్‌ను ఎస్టాబ్లిష్ చేసిన విధానం అలరిస్తాయి. బచ్చన్ సస్పెండ్ అయ్యి కోటిపల్లికి చేరడంతో కథ రొమాంటిక్ కోణంలోకి మలుపు తిరుగుతుంది. పాత హిందీ క్లాసిక్స్‌తో ముడిపెట్టి నాయకానాయికల లవ్‌ట్రాక్‌ను నడిపిన తీరు.. వాళ్ల మధ్య నడిచే క్యాసెట్స్ ప్రేమ రాయబారాలు అన్నీ ప్రేక్షకుల్ని వెనకటి రోజుల్లోకి తీసుకెళ్లిపోతాయి. దీనికి తోడు మధ్యలో దొరబాబుగా సత్య చేసే అల్లరి ప్రేక్షకులకు



కావాల్సినంత వినోదం పంచుతుంది. సరిగ్గా విరామానికి ముందు ముత్యం జగ్గయ్య ఇంటిపై రైడ్‌కు వెళ్లడం.. ఆ తర్వాత అక్కడ బచ్చన్ చేసే యాక్షన్ హంగామా.. కథను రసవత్తరంగా మారుస్తాయి.అయితే ప్రథమార్ధంలో కనిపించిన హరీష్ మార్కు మ్యాజిక్ ద్వితీయార్ధంలో సన్నగిల్లింది. ప్రతినాయకుడి అక్రమార్జనను తవ్వితీసే పక్రియలో హీరో బుర్రకు పదును పెట్టే సన్నివేశాలు కొన్ని అయినా ఉంటే బాగుండేది. ఆరంభంలో జగ్గయ్య పాత్రను కరుడుగట్టిన విలన్‌లా చూపించినప్పటికీ.. తన నుంచి బచ్చన్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురవవు. దీంతో కథలో సంఘర్షణ తగ్గింది. మధ్యలో సిద్ధు జొన్నలగడ్డ యాక్షన్ సీక్వెన్స్ కథకు కాస్త ఊపు తీసుకొచ్చినా, ఒక సాధారణ క్లైమాక్స్‌తో సినిమా ముగుస్తుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com